
ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
3
కృష్ణా జిల్లా వార్తలు
ఆదివారం 24 ఆగస్టు 2025





ఎకోదంతాయ

మట్టి విగ్రహాలకు భలే డిమాండ్

- బెజవాడలోని పలు ప్రాంతాల్లో విక్రయాలు
- కుమ్మరివీధిలో ఇళ్లలోనే తయారీ
- ఇళ్లలోనే నిమజ్జనం చేసుకునే అవకాశం

వినాయక చవితి పండుగ వచ్చేస్తోంది. వినాయక విగ్రహాలూ సిద్ధమైపోతున్నాయి. మార్కెట్‌లోకి అడుగుపెడితే చాలు.. రంగురంగుల, పెద్దపెద్ద విగ్రహాలు కనువిందు చేస్తున్నాయి. ఎంత భారీ విగ్రహమైనా.. ఎన్ని రంగులను పులిమినా.. ఎకో ఫ్రెండ్లీ వినాయకుడికి ఉన్న డిమాండ్ ఏ విగ్రహానికీ ఉండదంటే అతిశయోక్తి కాదు. అందుకే చవితికి నెల, రెండు నెలల ముందే చాలామంది వ్యాపారులు మట్టి విగ్రహాల తయారీలో నిమగ్నమైపోతారు. కొత్తూరు తాడేపల్లి, కొండపల్లి, మంగళగిరిలో వీటిని ఎక్కువగా తయారు చేస్తుండగా, గుణదలలోని కుమ్మరి వీధిలో చిన్న విగ్రహాల నుంచి పెద్ద విగ్రహాల వరకూ సిద్ధం చేస్తున్నారు. పూజల అనంతరం ఇంటిలోనే నిమజ్జనం చేసుకునేలా, ఆ తర్వాత అక్కడే మొక్క మొలిచేలా ఈ విగ్రహాలను తయారు చేస్తుండటం విశేషం.







తుది మెరుగులు

1. గణపతి నవరాత్రులకు సిద్ధమైన భారీ వినాయకుడు
2. బొజ్జ బుజ్జి గణేశ్ విగ్రహాలకు రంగులు అద్దుతున్న కళాకారుడు

6

రూ.22 లక్షలు బొక్కేశారు..

తేలిన 'ఉపాధి' అక్రమాల లెక్క

- జరిమానా రూ.2.50 లక్షలు
- సామాజిక తనిఖీ ప్రజా వేదికలో అధికారుల వెల్లడి
- పేదల కడుపు నింపమంటే తమ జేబులు నింపుకుంటున్న సిబ్బంది
- అధికారుల తీరుపై వెల్లువెత్తుతున్న విమర్శలు



పెనమకూరు వద్ద మట్టితవ్వకం జరిపిన ఓ పంట కాలువ

ఉపాధి హామీ సిబ్బంది అక్రమాల లెక్కను అధికారులు శనివారం తేల్చారు. 16 గ్రామాల్లో ఉపాధి హామి పనుల్లో జరిగిన అక్రమాలపై సిబ్బంది నుంచి రూ.22 లక్షలు రికవరికీ డ్వామా పీడీ ఎన్.వి.శివప్రసాద్ యాదవ్ ఆదేశించారు. అక్రమాలకు పాల్పడిన సిబ్బందికి రూ.2.50 లక్షల జరిమానా విధించారు. రూ.22 లక్షల రికవరీ మండలంలో ఉపాధి హామీ పనుల చరిత్రలో సంచలనమని చెప్పవచ్చు. పేదల కడుపు నింపమంటే తమ జేబులు నింపుకుంటున్నారని ఉపాధి సిబ్బంది, అధికారులపై విమర్శలు వ్యక్తమవుతున్నాయి.

తోట్లవల్లూరు, ఆగస్టు 23 (ఆంధ్రజ్యోతి): తోట్లవల్లూరు మండల పరిషత్ కార్యాలయం వద్ద శుక్రవారం మండలస్థాయి సామాజిక తనిఖీ ప్రజా వేదిక జరిగిన విషయం తెలిసిందే. శుక్రవారం సాయంత్ర వరకు అక్రమాల లెక్క ఎంతో తేల్చలేకపోయారు. అక్రమాలు భారీగా ఉండటంతో రెండోరోజు శనివారం లెక్క తేల్చారు. ఈ వివరాలను ఏపీఎం సురేష్ వెల్లడించారు.

అధికారులకు తెలిసే

2020 కరోనా సమయం నుంచి ఉపాధి హామీ పనుల్లో సిబ్బంది పెద్దఎత్తున అక్రమాలకు పాల్పడుతున్నట్టు ఆరోపణలు వస్తున్నాయి. అయినా అధికారులు చూసీ చూడనట్టు వదిలేస్తూ వచ్చారు. ఇది సిబ్బంది చేతి వాటానికి మరింత ఊతమిచ్చింది. ఫొటో తీయటం, కొలతల్లో ఇష్టమొచ్చినట్టుగా నమోదు చేయటం, అనుకూలమైన వ్యక్తులు ఒక్కరోజు పనికి వస్తే వారి అకౌంట్లలోకి అధికంగా డబ్బులు పంపించటం, తర్వాత వారు డ్రా చేసి ఉపాధి హామీ సిబ్బందికి కొంత, కూలీలు కొంత తీసుకుంటున్నారు. ఈ తతంగం అన్ని గ్రామాల్లో అధికారులకు తెలిసే జరుగుతోందని విమర్శలున్నాయి. ఉదాహరణకు బొడ్డపాడులో సోషల్ ఆడిట్ సిబ్బంది ఓ మహిళ ఇంటికి వెళ్లి ఎన్ని రోజులు పని చేశావని అడిగితే తాను ఒక రోజు మాత్రమే పనికి వచ్చానని తెలిపింది. తీరా ఆ మహిళ అకౌంట్‌లోకి రూ.9 వేలకు పైగా వచ్చినట్టు సోషల్ ఆడిట్ సిబ్బంది గుర్తించి ఇది సిబ్బంది చేసిన అక్రమమని తేల్చారు. అక్రమాలకు ఎక్కువగా పంట కాలువలు, బోదెలను సిబ్బంది ఎంచుకున్నట్టు స్పష్టమవుతోంది. కొలతల్లో నాలుగైదు మీటర్లు తేడా అంటే మానవ పొరపాటుగా అనుకోవచ్చు. కాని ఏకంగా 900 మీటర్లు తవ్వకం జరపకుండా జరిపినట్టు సిబ్బంది మిగతా 4లో..

రాజకీయ నేతల అండతో..

ఉపాధి హామీలోని సిబ్బంది అక్రమాలు చేయటంలో ఎలాంటి భయం లేకుండా ఉండటానికి కొన్ని సంవత్సరాలుగా ఉపేక్షిస్తూ రావటమేనని తెలుస్తోంది. ఎవరైనా సిబ్బంది తప్పు నిరూపణమైతే రాజకీయ నేతలు ఎంటరై అధికారుల చేతులు కట్టేస్తున్నారు. దీంతో తమకు రాజకీయ అండ ఉందని సిబ్బంది ఈ అక్రమాలకు తెగిస్తున్నారు.

విజయ దరహాసం

మెగా డీఎస్సీతో నిరుద్యోగుల కల నెరవేర్చిన ప్రభుత్వం

- ఫలితాల్లో మెరుగైన ర్యాంకులు సాధించిన జిల్లా వాసులు
- వీఆర్‌ఏ నుంచి స్కూల్ అసిస్టెంట్‌గా వెళ్లనున్న స్వయం ప్రభ
- తల్లిదండ్రులు లేకున్నా పట్టుదలతో విజయం సాధించిన జయకృష్ణ
- ఉపాధ్యాయులుగా మరెందరికో అవకాశం
- మచిలీపట్నం నోబుల్ కళాశాలలో సర్టిఫికెట్ల పరిశీలనకు ఏర్పాట్లు
- కలెక్టర్ చైర్మన్‌గా డీఎస్సీ-2025 కమిటీ ఏర్పాటు



పోలిమెట్ల స్వయం ప్రభ



మొవ్వ జయకృష్ణ

నిరుద్యోగ యువతకు ఉద్యోగాల కల్పనే లక్ష్యంగా కూటమి ప్రభుత్వం అడుగులు వేసింది. ఎన్నో ఏళ్లుగా ఎదురుచూస్తున్న మెగా డీఎస్సీ నిర్వహించింది. ప్రతిష్టాత్మంగా ఫలితాలు విడుదల చేసింది. అత్యధిక మార్కులతో మెరుగైన ర్యాంకులు సాధించిన అభ్యర్థులు ఇన్నాళ్లు తాము పడ్డ కష్టాన్ని క్షణంలో మరచి విజయదరహాసం ప్రదర్శించారు. ఉపాధ్యాయ కొలువుల్లో చేరేందుకు సిద్ధమవుతున్నారు. ఈ సందర్భంగా ప్రతిభచూపిన అభ్యర్థులపై ప్రత్యేక కథనం.

ఆంధ్రజ్యోతి-మచిలీపట్నం : కూటమి ప్రభుత్వం ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీ ప్రకారం మెగా డీఎస్సీ ప్రకటించటంతో ర్యాంకులు సాధించి ఉద్యోగానికి అర్హత పొందిన అభ్యర్థులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు. డీఎస్సీ-2025లో భాగంగా ఉమ్మడి జిల్లాలో 1,208 పోస్టులను భర్తీ చేసేందుకు ప్రభుత్వం అనుమతులు ఇచ్చింది. ఈ పోస్టుల కోసం 67,470 మంది అభ్యర్థులు పరీక్ష రాశారు. ఈ నెల 12వ తేదీన అభ్యర్థులకు సంబంధించిన మార్కులను విడుదల చేయగా, శుక్రవారం అభ్యర్థులు సాధించిన ర్యాంకులను విడుదల చేశారు. ఉమ్మడి జిల్లాలోని జిల్లాపరిషత్, మండల పరిషత్, మునిసిపల్ పాఠశాలల్లో స్కూల్ అసిస్టెంట్(ఎస్ఏ) 663 పోస్టులు, సెకండరీగ్రేడ్ టీచర్ (ఎస్జీటీ)లు 545 పోస్టులను భర్తీ చేయనున్నారు. వీటితో పాటు గిరిజన



సమావేశంలో మాట్లాడుతున్న డీఈవో పీవీజే రామారావు

సంక్షేమ పాఠశాలల్లో మరో ఐదు పోస్టులను భర్తీ చేయనున్నారు. ప్రభుత్వం అనుమతి ఇచ్చిన తేదీలలో మచిలీపట్నంలోని నోబుల్ కళాశాలలో అభ్యర్థులకు సంబంధించిన సర్టిఫికెట్ల పరిశీలన కార్యక్రమం ఉంటుంది. ఇప్పటికే అభ్యర్థుల సర్టిఫికెట్ల పరిశీలన కోసం రెవెన్యూ అధికారులు, ఎంఈవోలు, పాఠశాలల ప్రధానోపాధ్యాయులతో ప్రత్యేక కమిటీలను కలెక్టర్ ఏర్పాటు చేశారు. కలెక్టర్, జేసీ, జెడ్పీ చైర్‌పర్సన్, జెడ్పీ సీఈవో, డీఈవోలతో డీఎస్సీ-2025 ఉద్యోగ నియామకాల కోసం జిల్లా స్థాయి కమిటీని కలెక్టర్ ఏర్పాటు చేశారు. ఈ కమిటీకి కలెక్టర్ చైర్మన్‌గా వ్యవహరిస్తారు. డీఎస్సీ అభ్యర్థులకు సంబంధించి సర్టిఫికెట్‌ల పరిశీలనలో పాటించాల్సిన నియమాలపై కమిటీ సభ్యులకు డీఈవో పీవీజే రామారావు శనివారం నోబుల్ కళాశాలలో శిక్షణకార్యక్రమం నిర్వహించారు. 2018లో టీడీపీ అధికారంలో ఉన్నపుడు డీఎస్సీ నోటిఫికేషన్‌ను జారీ చేశారు. 2019లో వైసీపీ అధికారంలోకి వచ్చాక డీఎస్సీ నోటిఫికేషన్‌లను విడుదల చేయలేదు. 2024 ఫిబ్రవరిలో ఎన్నికల ముందు డీఎస్సీ నోటిఫికేషన్‌ను విడుదల చేసినా, పరీక్షలకు సిద్ధమయ్యేందుకు సమయం చాలదనే కారణంతో హైకోర్టు ఈ నోటిఫికేషన్‌ను నిలిపివేసింది. గత ఐదు సంవత్సరాలుగా డీఎస్సీ నోటిఫికేషన్ మిగతా 4, 6లో..

ఎన్‌హెచ్-216 విస్తరణకు డీపీఆర్ రూపొందించండి

- ఎన్‌హెచ్‌కు కేంద్రం ఆదేశాలు
- కృష్ణాజిల్లాలో భారీగా భూ సేకరణ
- పూర్తిగా సిమెంట్ కాంక్రీట్‌తో నిర్మాణం



(ఆంధ్రజ్యోతి, విజయవాడ) : కత్తిపూడి నుంచి ఒంగోలు వరకు ఎన్‌హెచ్-216 నాలుగు వరసల విస్తరణకు అడుగు ముందుకుపడింది. బంగాళాఖాతం సముద్రతీర ప్రాంతం వెంబడి సాగే ఈ జాతీయ రహదారి ప్రస్తుతం రెండు లేన్లుగా ఉంది. మచిలీపట్నం పోర్టు అవసరాలను దృష్టిలో ఉంచుకుని యుద్ధప్రాతిపదికన దీనిని అభివృద్ధి చేయాలని కేంద్ర ప్రభుత్వం నిర్ణయించింది. నాలుగు వరుసలుగా విస్తరించేందుకు వీలుగా డీపీఆర్ తయారీకి కేంద్ర ప్రభుత్వం ఎన్‌హెచ్ ఉన్నతాధికారులను ఆదేశించింది. త్వరలో కన్సల్టెన్సీ సంస్థను ఎంపిక చేసి బాధ్యతలు అప్పగించనున్నారు. భూ సేకరణ, నిర్మాణ వ్యయాలకు సంబంధించి సమగ్ర అంచనా వేయనున్నారు.

కృష్ణాజిల్లాలో భారీ భూసేకరణ

కృష్ణాజిల్లాలో బంటుమిల్లి, పెడన, కృత్తివెన్ను మండలాల పరిధిలో ప్రస్తుతం ఎన్‌హెచ్-216 వెంబడి నివాసాలు, పొలాలు ఉండటం వల్ల పెద్దసంఖ్యలోనే భూ సేకరణ జరిపే అవకాశం ఉంటుంది. సముద్ర తీరప్రాంతం కారణంగా రెండు వరుసలను పూర్తిగా సిమెంట్ కాంక్రీట్‌తో నిర్మించారు. ప్రస్తుత నాలుగు వరసల రోడ్డును కూడా అలాగే నిర్మించాలని భావిస్తున్నారు. దేశంలో ఏ హైవేకు లేని విధంగా ఎన్‌హెచ్-216కు 30 ఏళ్ల మెయింటెనెన్స్ అగ్రిమెంట్ ఉంటుంది. సాధారణంగా 15 ఏళ్లకు మించి మెయింటెనెన్స్ ఇవ్వరు. సిమెంట్ కాంక్రీటింగ్ రోడ్డు కాబట్టి 30 ఏళ్లు ఇస్తున్నారు. ఒకవేళ రోడ్డు దెబ్బతింటే కాంట్రాక్టర్ నిర్వహణ పనులను 30 ఏళ్ల పాటు చేపట్టాలి. ఈ జాతీయ రహదారి విస్తరణ కృష్ణాజిల్లాలోని కృత్తివెన్ను మండలం నుంచి పెడన మీదుగా బంటుమిల్లి వరకు సాగుతుంది.

క్వాంటమ్ టెక్నాలజీ అభివృద్ధికి ఒప్పందం

పర్వతారోహకుడు అనుమోలుకు కలెక్టర్ అభినందనలు

6లో



స్వచ్ఛతతో స్వర్ణాంధ్ర సాధన

- మంత్రి కొల్లు రవీంద్ర

రూ.5,800 కోట్లతో తాగునీటి సమస్య పరిష్కారం

4లో

మ్యూల్ మాయలోడు

- తెలంగాణ సైబర్ కాప్స్‌కు చిక్కిన విజయవాడ యువకుడు శరణ్
- 'ఈ' నేరగాళ్లకు బ్యాంకు ఖాతాలు సమకూర్చిన కంత్రీ
- మ్యూల్ అకౌంట్ల ద్వారా రూ.500 కోట్ల లావాదేవీలు
- ఉత్తరాఖండ్‌లో అరెస్టు చేసిన సైబర్ క్రైం బ్యూరో

4

అతడి వయస్సు 30 ఏళ్లు. రెండు నెలల వ్యవధిలో అతడు బ్యాంక్ ఖాతాల ద్వారా చేయించిన లావాదేవీలు రూ.500కోట్లు. అతడే విజయవాడకు చెందిన వడ్డేవల్లి లలిత శరణ్‌కుమార్. అతడు ఏదో కంపెనీకి సీఈవో అనుకుంటే పొరపాటే. నిత్యం దేశవ్యాప్తంగా ఎవరో ఒకరి ఖాతాలను ఖాళీ చేయిస్తున్న 'ఈ' నేరగాళ్లకు ఖాతాల లింక్‌ను కలిపాడు. సైబర్ నేరగాళ్లతో చేతులు కలిపి వారికి బ్యాంక్ ఖాతా(మ్యూల్ అకౌంట్ల)ను ఏర్పాటు చేశాడు. స్వదేశంలో ఉంటూ ఇండియన్ బ్యాంక్ ఖాతాలను తెరిపిస్తున్న అతడిని పోలీసులు అరెస్టు చేశారు.

కొనసాగుతున్న వరద

- ప్రకాశం బ్యారేజీకి ఇన్‌ఫ్లో 3.92 లక్షలు

విజయవాడ, ఆగస్టు 23 (ఆంధ్రజ్యోతి): జిల్లాలోని పులిచింతల, ప్రకాశం బ్యారేజీకి వరద కొనసాగుతోంది. కొద్దిరోజుల క్రితం వరకు ఈ రెండింటికి నాలుగు లక్షల క్యూసెక్కుల వరద వచ్చింది. ఇది ఐదు లక్షల క్యూసెక్కులకు చేరుతుందని అంచనా వేశారు. కానీ రెండు, మూడు రోజుల నుంచి వరద తగ్గుతూ వస్తోంది. ప్రస్తుతం ప్రకాశం బ్యారేజీకి 3,92,970 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో వస్తోంది. బ్యారేజీ 55 గేట్లను పూర్తిస్థాయిలో, 14 గేట్లను ఎనిమిది అడుగుల మేరకు ఎత్తి 3,75,125 క్యూసెక్కుల నీటిని దిగువకు విడుదల చేస్తున్నారు. పాలేరు నుంచి 885, పులిచింతల నుంచి 3,81,331, కీసర నుంచి 6,911 క్యూసెక్కుల నీరు బ్యారేజీకి వస్తోంది. మున్నేరు, బుడమేరుకు ఎగువ నుంచి ఎలాంటి నీటి ప్రవాహం లేదు. బ్యారేజీ నుంచి తూర్పు, పశ్చిమ డెల్టా పరిధిలోని కాల్వలకు 17,795 క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నారు. పులిచింతల ప్రాజెక్టుకు నాగార్జున సాగర్ నుంచి 3,82,100 క్యూసెక్కుల నీరు వస్తోంది. ఈ ప్రాజెక్టు నుంచి 3,81,655 క్యూసెక్కుల నీటిని దిగువకు విడుదల చేస్తున్నారు. ఆదివారం పులిచింతలకు ఇన్‌ఫ్లో పెరిగే అవకాశాలు ఉన్నాయని ప్రాజెక్టు అధికారులు భావిస్తున్నారు. నాగార్జున సాగర్‌కు ఎగువన ఉన్న శ్రీశైలం నుంచి శనివారం ఐదు లక్షల క్యూసెక్కుల నీటిని దిగువకు విడుదల చేస్తున్నారు.ఈ నీటి విడుదల పెరిగితే పులిచింతల, ప్రకాశం బ్యారేజీకి ఇన్‌ఫ్లో పెరుగుతుంది.



దుర్గగుడిలో జరుగుతున్న అభివృద్ధి పనులు పరిశీలించి సూచనలు చేస్తున్న ఈవో శీనా నాయక్

దుర్గగుడి అభివృద్ధి పనుల పరిశీలన

ఇంద్రకీలాద్రి, ఆగస్టు 23 (ఆంధ్రజ్యోతి) : దుర్గామల్లేశ్వర స్వామి దేవస్థానంలో జరుగుతున్న అభివృద్ధి పనులను ఈవో శీనానాయక్ శనివారం పరిశీలించారు. దసరా మహోత్సవాల నేపథ్యంలో పనులను వేగవంతం చేయాలని అధికారులను ఆదేశించారు. మహా మండపం వద్ద రెండో మొబైల్ డిపాజిట్ కౌంటర్‌ను ఏర్పాటు చేయాలని నిర్ణయించారు. దసరా ఉత్సవాల సందర్భంగా భక్తులకు నిరంతరాయంగా అన్నదానం అందించేందుకు కొత్తగా నిర్మిస్తున్న అన్నదాన భవనంలో తాత్కాలిక ఏర్పాట్లను సమీక్షించారు. పనులను త్వరగా పూర్తి చేయాలని ఇంజనీరింగ్ అధికారులను ఆదేశించారు. డ్రైనేజీ వ్యవస్థను మెరుగుపరచాలని, భక్తుల రద్దీ ఎక్కువగా ఉన్నప్పుడు సురక్షితంగా బయటకు వెళ్లేందుకు ప్రణాళికలు సిద్ధం చేయాలని ఆదేశించారు. కనకదుర్గా నగర్ సమీపంలో కొత్త క్లాక్‌రూమ్, సమాచార కేంద్రం, చెప్పులస్టాండ్ తదితర సౌకర్యాలు ఏర్పాటు చేయాలన్న దానిపై ఇంజనీరింగ్ విభాగం అధికారులతో సమీక్షించారు.

వినాయకచవితి ఉత్సవాలు 27 నుంచి : ఈవో

ఇంద్రకీలాద్రి, ఆగస్టు 23 (ఆంధ్రజ్యోతి) : విశ్వావసు నామ సంవత్సరం భాద్రపద శుద్ధ చవితిని పురస్కరించుకుని దుర్గామల్లేశ్వర దేవస్థానంలో ఈనెల 27 నుంచి 29వ తేదీ వరకు వినాయక చవితి ఉత్సవాలు ఘనంగా నిర్వహిస్తున్నట్లు దేవస్థానం ఈవో వి.కె.శీనానాయక్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. 27వ తేదీ ఉదయం 7 గంటలకు విఘ్నేశ్వర పూజ, కలశ స్థాపన, విశేష పత్రిపూజ, గణపతి హోమం నిర్వహించనున్నారు. చిన్న రాజగోపురం మహాగణపతి స్వామి మం దిరం వద్ద ఆవాహన దేవతా హోమాలు, హారతి, మంత్రపుష్పం, తీర్థ ప్రసాద వినియోగం నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. 28వ తేదీ ఉద యం 8 గంటలకు గణపతి హోమం, సాయంత్రం 4 గంటలకు ఆవాహన దేవతా హోమాలు, హారతి, మంత్ర పుష్పం తీర్థ ప్రసాద వినియోగం, 29వ తేదీ ఉదయం 9.30 గంటలకు పూర్ణాహుతి నిర్వహించనున్నట్లు తెలిపారు. సాయంత్రం 5 గంటలకు మృత్తికా గణపతి విగ్రహ నిమజ్జన జరుగుతుందన్నారు.



పాత ఎడ్లంకలో కోతకు గురౌతున్న ప్రాంతాన్ని పరిశీలిస్తున్న ఆర్డీవో స్వాతి

హోం మంత్రి ఆదేశంతో కదలిన యత్రాంగం

● కోతకు గురౌతున్న పాత ఎడ్లంక సందర్శన

అవనిగడ్డ, ఆగస్టు 23 (ఆంధ్రజ్యోతి) : పాత ఎడ్లంక గ్రామం తీవ్రంగా కోతగురౌతున్న నేపథ్యంలో ఎట్టకేలకు అధికార యంత్రాంగం కదిలింది. కృష్ణా నది కోత కారణంగా ఎడ్లంక గ్రామం కనుమరుగయ్యే పరిస్థితి ఏర్పడిందని, వెంటనే విపత్తుల నిర్వహణ, నివారణ సంస్థ ద్వారా సమస్యను పరిష్కరించాలని టీడీపీ నేత బొబ్బా గోవర్ధన్ హోం మంత్రి అనితకు విజ్ఞప్తి చేశారు. హోం మంత్రిత్వ శాఖ నుంచి వచ్చిన ఆదేశాల మేరకు శనివారం ఆర్డీవో స్వాతి, రెవెన్యూ అధికారులు ఎడ్లంక గ్రామాన్ని సందర్శించారు. గత సంవత్సర కాలం గా, ఐదేళ్లలో ఏ స్థాయిలో ఎడ్లంక కోతకు గురైందనే విషయాలను ఆర్డీవో గ్రామస్థులను అడిగి తెలుసుకున్నారు. వెంటనే కోత నివారణ చర్యలు చేపట్టకుంటే ఎడ్లంక దీవి కనుమరుగయ్యే ప్రమాదం ఉందని గ్రామస్థులు తెలియజేశారు. గ్రామస్థుల ఇబ్బందులను అక్కడి వాస్తవ పరిస్థితులను అధికారులు ప్రభుత్వానికి నివేదించాలని టీడీపీ నేతలు కనపర్తి శ్రీనివాసరావు, బొబ్బా గోవర్ధన్ అధికారులకు సూచించారు. తహసీల్దార్ నాగమల్లేశ్వరరావు, ఇరిగేషన్, రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.



ముంజులూరులో మైక్రో ఫిల్టర్‌ను ప్రారంభిస్తున్న ఎంపీ బాలశౌరి, ఎమ్మెల్యే కాగిత

రూ.5,800 కోట్లతో తాగునీటి సమస్య పరిష్కారం

బంటుమిల్లి, ఆగస్టు 23 (ఆంధ్రజ్యోతి) : జిల్లా యూనిట్‌గా రూ.5,800 కోట్లతో తాగునీటి సమస్య పరిష్కారానికి చర్యలు చేపట్టామని ఎంపీ వల్లభనేని బాలశౌరి అన్నారు. ముంజులూరులో రూ.10లక్షతో నిర్మించిన మైక్రో ఫిల్టర్‌ను, బర్రిపాడు, ముంజులూరు, సాతులూరు, ముల్లపర్రు, నాగన్న చెరువు గ్రామాల్లో మైక్రో ఫిల్టర్లను ఆయన ప్రారంభించారు. మల్లంపూడి గ్రామంలో రూ.35 లక్షల వ్యయంతో నిర్మించే తాగునీటి పథకానికి భూమిపూజ చేశారు. కంచడంలో బ్యాంక్ ఆఫ్ ఇండియా బ్రాంచిని ప్రారంభించారు. పీఏసీఎస్ అధ్యక్షుడు గంధం సత్యనారాయణ అభినందన సభలో పాల్గొని ఆయనను ఎంపీ బాలశౌరి, ఎమ్మెల్యే కాగిత కృష్ణప్రసాద్ సన్మానించారు. బంటుమిల్లిలో ఆర్టీసీ బస్సును ఆపి స్త్రీశక్తి పథకం అమలు ఏ విధంగా జరుగుతుందో మహిళలను అడిగి తెలుసుకున్నారు. ఆయనా కార్యక్రమాల్లో గుడివాడ మాజీ ఎమ్మెల్యే రావి వెంకటేశ్వరావు, మండల పార్టీ అధ్యక్షుడు కూనపరెడ్డి వీరబాబు, జనసేన ఇన్‌చార్జి పంచకర్ల సురేష్, డీసీ ఛైర్మన్ కాశీ, మార్కెట్ యార్డు ఛైర్మన్ ఒడుగు తులసీరావు, జడ్పీటీసీ సభ్యులు వెంకటరమణ, కూనపరెడ్డి సునీత, రేవు గోపాలకృష్ణ, రేవు శ్రీనివాసరావు, కేదార్, ఇల్లూరి లీలాకృష్ణ, ర్యాలీ సత్యనారాయణ, ఆయా గ్రామాల సర్పంచ్‌లు, కూటమి నేతలు పాల్గొన్నారు.

డీఎస్సీ అభ్యర్థుల సర్టిఫికెట్ల పరిశీలనకు 24 కమిటీలు

మచిలీపట్నం టౌన్, ఆగస్టు 23 (ఆంధ్రజ్యోతి) : డీఎస్సీ మెరిట్ అభ్యర్థుల సర్టిఫికెట్లను పరిశీలించేందుకు అన్ని ఏర్పాట్లు చేసినట్టు డీఈవో పి.వి.జె. రామారావు తెలిపారు. నోబుల్ కళాశాల సమావేశ మందిరంలో శనివారం డీఎస్సీ మెరిట్ అభ్యర్థుల సర్టిఫికెట్లను పరిశీలనపై శిక్షణ ఇచ్చారు. సర్టిఫికెట్ల పరిశీలనకు 24 కమిటీలను ఏర్పాటు చేశామన్నారు. ఒక్కో కమిటీలో ఎంఈవో, రెవెన్యూ అధికారి, హెడ్మాస్టరు, ఒక టెక్నికల్ అసిస్టెంట్ ఉంటారన్నారు. ఫేక్ యూనివర్శిటీల జాబితాలను కమిటీ సభ్యులకు ఇచ్చామన్నారు. అభ్యర్థులు తాజాగా తీసుకున్న కుల ధ్రువీకరణ పత్రం, గెజిటెడ్ అధికారి ధ్రువీకరించిన సర్టిఫికెట్ల జిరాక్స్ కాపీలు మూడు సెట్లు, ఐదు పాస్‌పోర్టు సైజు ఫోటోలు పరిశీలనకు నోబుల్ కళాశాలకు తీసుకునిరావాలన్నారు. అభ్యర్థులు సరిఫికెట్‌లను వెబ్‌సైట్‌లో అప్‌లోడ్ చేయాలన్నారు. ప్రభుత్వం నిర్ణయించిన తేదీన సమయానికి హాజరు కాకపోతే అభ్యర్థిత్వం రద్దు చేస్తారన్నారు. తరువాతి అభ్యర్థిని ఆహ్వానిస్తారన్నారు. 50 మంది అభ్యర్థులకు ఒక గదిని, ఒక కమిటీని కేటాయించామన్నారు. దివ్యాంగుల ధ్రువీకరణ పత్రాలను వైద్యులు పరిశీలిస్తారన్నారు. డీఎస్సీ సర్టిఫికెట్ల పరిశీలనకు జిల్లా పరిశీలకునిగా సమగ్ర శిక్ష అడిషనల్ ప్రాజెక్టు కో- ఆర్డినేటర్ ప్రసన్నకుమార్‌ను నియమించామన్నారు. సర్టిఫికెట్ల పరిశీలన షెడ్యూల్ త్వరలో ప్రకటిస్తుందని, ఆ షెడ్యూల్ అభ్యర్థులు సర్టిఫికెట్లతో నోబుల్ కళాశాలకు హాజరు కావాలన్నారు. బందరు డీవైఈవో సింగ్, గుడివాడ డీవైఈవో రవికుమార్, ఉయ్యూరు డీవైఈవో పద్మారాణి, విద్యాశాఖ అసిస్టెంట్ డైరెక్టర్ విద్యాలత, దివ్యాంగుల శాఖ అసిస్టెంట్ డైరెక్టర్ వాడ్రేవు కామరాజు తదితరులు పాల్గొన్నారు.

కనక దుర్గమ్మ సేవలో హైకోర్టు నాయమూర్తులు

ఇంద్రకీలాద్రి, ఆగస్టు 23 (ఆంధ్రజ్యోతి) : ఇంద్రకీలాద్రిపై కనకదుర్గమ్మను శనివారం హైకోర్టు న్యాయమూర్తులు కుటుంబ సమేతంగా దర్శించుకున్నారు. జస్టిస్ గోపాలకృష్ణారావు, జస్టిస్ జ్యోతిర్మయి, జస్టిస్ కె.సురేష్‌రెడ్డి కుటుంబ సభ్యులతో కలిసి దుర్గగుడికి విచ్చేశారు. ఈవో వి.కె.శీనానాయక్, అర్చకులులు ఆలయ మర్యాదలతో స్వాగతం పలికి అమ్మవారి దర్శనం కల్పించారు. వేద పండితులు ఆశీస్సులు అందజేశారు. ఈవో శీనానాయక్ అమ్మవారి చిత్రపటం, లడ్డూ ప్రసాదం, శేషవస్త్రం న్యామూర్తులకు అందజేశారు.



హైకోర్టు న్యాయమూర్తులు జస్టిస్ గోపాలరావు, జస్టిస్ జ్యోతిర్మయి, జస్టిస్ సురేష్‌రెడ్డి దంపతులకు అమ్మవారి చిత్రపటాలు బహుకరిస్తున్న ఈవో శీనానాయక్



కిలేశపురం సమీపంలోని బూడిద చెరువు కట్టవద్ద పాలధారలా కనువిందు చేస్తున్న జలపాతం

మిల్కీ జలపాతం కనువిందు

● కృత్రిమం.. అయినా కన్నార్పలేం ● ఏడాది పొడవునా జాలువారే పాలధార

(ఆంధ్రజ్యోతి, ఇబ్రహీంపట్నం)

ఇబ్రహీంపట్నం మండలం కిలేశపురం గ్రామ పరిధిలో బూడిద చెరువు కట్ట వద్ద కృత్రిమ జలపాతం కనువిందు చేస్తోంది. ఈజలపాతాన్ని తనివితీరా చూసేందుకే కానీ ఈతకు మాత్రం కాదని పర్యాటక ప్రేమికులు గమనించాలి. వరదల సమయంలో డ్యామ్ గేట్లు ఎత్తినపుడు జాలువారే నీటిని చూస్తే కలిగే అనుభూతి సరిగ్గా ఇక్కడ కలుగుతుంది. సహజ సిద్ధ జలపాతం కాదని, డ్యామ్ కాదని తెలిసినా సందర్శకులు మాత్రం కృత్రిమ జలపాతాన్ని చూడటానికి ఎక్కడెక్కడి నుంచో వస్తుంటారు. ఎత్తైన ఒక గోడ మీద నుంచి కిందకు జాలువారే పాలధార (జలధార)ను తనవితీరా చూడాల్సిందే. బూడిద కలిసిన నీళ్ల కావటంతో తెల్లగా పాలను పోలి ఉంటాయి. ఒక వైపు పచ్చని పంట పొలాలు, మరో పక్క ఎత్తైన పచ్చదనపు కొండలు నడుమ ఉన్న ఈ జలపాతపు అందం వర్ణనాతీతం.

ఈ జలపాతం ఎక్కడుందంటే..

హైదరాబాద్ జాతీయ రహదారిలో ఇబ్రహీంపట్నం మండలం కిలేశపురం గ్రామ పరిధిలో బూడిద చెరువు కట్ట దగ్గర ఈ కృత్రిమ జలపాతం ఉంది. ఎన్‌టీటీపీఎస్ నుంచి బూడిద చెరువులోకి వచ్చే బూడిద నీటిని ఇక్కడ బయటకు వదులుతారు. డ్యామ్ తరహాలో బూడిద చెరువు కట్టకు ఎత్తైన గోడ నిర్మించి దానికి పైభాగంలో ఒక రంధ్రాన్ని ఏర్పాటు చేసి వచ్చే నీటిని దిగువకు వదులుతుండడంతో కిందకు వెళ్లే బూడిద నీరు పాలధారలా కనువిందు చేయడం గమనార్హం.

ప్రయాణం మార్గం ఇలా..

విజయవాడ నగరం నుంచి వచ్చే వారు ఇబ్రహీంపట్నం మండల మూలపాడు దగ్గర యూటర్న్ తీసుకొని రెండు కిలో మీటర్ల దూరం వచ్చిన తర్వాత కిలేశపురం గ్రామం దగ్గర రాతి క్వారీ పక్కన ఘాట్ రోడ్డులోకి వెళ్లాలి. ఘాట్ రోడ్డులో రెండు కిలో మీటర్ల దూరం వెళ్లిన తర్వాత ఈ జలపాతం వస్తుంది. హైదరాబాద్ వైపు నుంచి వచ్చే వారు సైతం కిలేశపురం గ్రామం ప్రారంభంలోనే రాతి క్వారీ పక్కనే ఉన్న ఘాట్ రోడ్డు ద్వారా ఇక్కడకు చేరుకోవచ్చు.



పచ్చని చెట్లతో సుందరంగా జలపాతం పరిసరాలు

పర్యాటక ప్రాంతంగా తీర్చిదిద్దాలి

కొండపల్లి ఖిల్లా, పవిత్ర సంగమం, మూలపాడు నగరవనానికి సెంటర్ పాయింట్‌లో ఉన్న ఈ జలపాతాన్ని పర్యాటకంగా అభివృద్ధి చేయాల్సిన అవసరం ఎంతైనా ఉంది. జలపాతం ఉన్న ప్రాంతంలో పచ్చని చెట్ల మధ్య పార్క్ ఏర్పాటు చేసి బల్లలు, ఆట వస్తువులు, ఇతర సౌకర్యాలు కల్పిస్తే పర్యాటకుల సంఖ్య మరింత పెరిగే అవకాశం ఉంటుంది. సీజన్‌తో సంబంధం లేకుండా ఏడాది పొడవునా బూడిద నీరు జాలువారుతూనే ఉంటాయి కనుక పర్యాటకుల ఆదరణ ఎప్పుడూ ఉంటుందని అభిప్రాయపడుతున్నారు.



పర్యాటకులకు హెచ్చరిక

బూడిద చెరువులో నుంచి వచ్చే నీరు హానికరమైనవి అని, ఇది నిషిద్ధ ప్రదేశమని పేర్కొంటూ ఎన్టీటీపీఎస్ అధికారులు హెచ్చరిక బోర్డును ఏర్పాటు చేశారు. సెల్ఫీ, ఫొటోలు తీయవద్దని, తొట్టెలోని నీటిలో స్నానాలు చేయవద్దని బోర్డులో రాశారు. ఏదైనా ప్రమాదం జరిగితే తమకు ఎలాంటి సంబంధం లేదని ఎన్టీటీపీఎస్ అధికారులు బోర్డు ఏర్పాటు చేశారు. అయినా ఆ నీటిలో చాలా మంది యువకులు స్నానాలు చేస్తుండడం ఎప్పటికైనా ప్రమాదమని గ్రహించాలి.



దివిసీమలో వరద తగ్గుముఖం

అవనిగడ్డ రూరల్, ఆగస్టు 23 (ఆంధ్రజ్యోతి) : నిన్నటి వరకు దివిసీమ ప్రజలను ఆందోళనకు గురి చేసినవరద ప్రవాహం శనివారం కొద్దిమేర తగ్గుముఖం పట్టింది. ప్రకాశం బ్యారేజీ నుంచి 3.75 లక్షల మేర వరద ప్రవాహం కొనసాగుతోంది. కృష్ణానది తీర ప్రాంత గ్రామాల్లో ఉన్న ప్రజలు కృష్ణమ్మ శాంతించటంలో కొద్దిమేర ఊపిరి పీల్చుకున్నారు. **నాగాయలంక :** ప్రకాశం బ్యారేజీ నుంచి నీరు విడుదల తగ్గటంతో నాగాయలంక రేవులో శనివారం వరద ప్రవాహం తగ్గింది. దీవుల ప్రజలు, అధికారులు హాయిగా ఊపిరి పీల్చుకున్నారు. వరద తీవ్రత తగ్గినా నాగాయలంకలోని శ్రీరామపాదక్షేత్రంలో శ్రీరామలింగేశ్వరస్వామి ఆల యం, కృష్ణవేణమ్మ విగ్రహం ఇంకా జలదిగ్బంధంలో ఉన్నాయి.

సురవరం సుధాకర్‌రెడ్డి మృతి బాధాకరం : ఉమా

వన్‌టౌన్, ఆగస్టు 23 (ఆంధ్రజ్యోతి): సీపీఐ అగ్రనేత, పార్లమెంట్ మాజీ సభ్యుడు సురవరం సుధాకర్ రెడ్డి మృతి బాధాకరమని మాజీ మంత్రి, టీడీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి దేవినేని ఉమామహేశ్వరరావు ఒక ప్రకటనలో తెలిపారు. సుధాకర్‌రెడ్డి మృతి పట్ల ఆయన సంతా పం, కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి ప్రకటించారు. విద్యార్థి సంఘ నాయకుడి నుంచి అనునిత్యం ప్రజల కోసం పనిచేసిన ఆయన ఎక్కడా రాజీపడకుండా వి లువలతో కూడిన రాజకీయంతో సేవలను అందించారన్నారు. ఆయన పవిత్ర ఆత్మకు శాంతి చేకూరాలని భగవంతుడిని ప్రార్థిస్తున్నట్లు తెలిపారు.

స్వచ్ఛతతో స్వర్ణాంధ్ర సాధన

● మంత్రి రవీంద్ర, కలెక్టర్ బాలాజీ

మచిలీపట్నం టౌన్, ఆగస్టు 23 (ఆంధ్రజ్యోతి) : స్వచ్ఛతతోనే స్వర్ణాంధ్రప్రదేశ్ సాధిద్దామని మంత్రి కొల్లు రవీంద్ర అన్నారు. బందరు మండలం పోతేపల్లిలో స్వర్ణాంధ్ర - స్వచ్ఛాంధ్ర కార్యక్రమంలో భాగంగా శనివారం నిర్వహించిన ర్యాలీలో మంత్రి కొల్లు రవీంద్ర, కలెక్టర్ బాలాజీ పాల్గొన్నారు. మురుగు కాలువల్లో దోమల నివారణకు ఆయిల్ బాల్స్ వేశారు. సంపద తయారీ కేంద్రాన్ని సందర్శించారు. జడ్పీ ఉన్నత పాఠశాలను సందర్శించారు. ఆంజనేయ స్వామి గుడి వద్ద ఏర్పాటు చేసిన సమావేశంలో మంత్రి కొల్లు రవీంద్ర మాట్లాడారు. సీఎం చంద్రబాబు హయాంలో పెద్ద ఎత్తున మొక్కలు నాటే కార్యక్రమం చేపట్టామన్నారు. అక్టోబరు 2న గాంధీ జయంతి నాడు సీఎం చంద్రబాబు డంపింగ్ యార్డును సందర్శించారని, ఈ చెత్తను గుంటూరులోని సంపద తయారీ కేంద్రానికి పంపుతున్నామన్నారు. ఇందుకు రెండు కంపాక్టర్లను కొనుగోలు చేసి 90 టన్నుల చెత్తను గుంటూరు, విజయవాడ పవర్ ప్లాంట్‌కు పంపుతున్నామన్నారు. కృష్ణా విశ్వవిద్యాలయం వద్ద 13 ఎకరాలను గుర్తించామని, అక్కడ పవర్‌ప్లాంట్ ఏర్పాటుకు ప్రణాళిక సిద్ధం చేస్తున్నామన్నారు.



పోతేపల్లిలో సంపద తయారీ కేంద్రాన్ని సందర్శించి పారిశుధ్య కార్మికులను అభినందిస్తున్న మంత్రి కొల్లు రవీంద్ర, కలెక్టర్ బాలాజీ

పోతేపల్లిలో డ్రెయిన్ల సమస్య పరిష్కారానికి డీఆర్‌ఎంతో మాట్లాడామని, రూ.3 కోట్లతో డ్రైన్ నిర్మిస్తున్నామన్నారు. కలెక్టర్ బాలాజీ మాట్లాడుతూ ప్రతి శుక్రవారం ప్రభుత్వం డ్రైడేగా ప్రకటించిందని, తొట్టెల్లోని నిల్వ నీటిని తొలగించాలన్నారు. డీపీవో జె.అరుణ మాట్లాడుతూ, 497 పంచాయతీల్లో స్వర్ణాంధ్ర, స్వచ్ఛాంధ్ర నిర్వహిస్తున్నామన్నారు. జడ్పీ సీఈవో కె.కన్నమనాయుడు, వ్యవసాయ మార్కెట్ కమిటీ ఛైర్మన్ కుంచే నాని, తహసీల్దార్ నాగభూషణం, ఎంపీడీవో వెంకటేష్, డీఎల్‌పీవో రహ్మతుల్లా, ఎంఈవో దుర్గాప్రసాద్, మార్కెట్ యార్డు మాజీ ఛైర్మన్ గోపు సత్యనారాయణ, మాజీ ఎంపీపీ కాగిత వెంకటేశ్వరరావు, ఎస్సీ, ఎస్టీ మానిటరింగ్ కమిటీ సభ్యుడు విద్యాసాగర్, పాఠశాల హెచ్‌ఎం మురళీకృష్ణ, సెక్రటరీ నరసింహారావు, వీఏవో రామలక్ష్మి పాల్గొన్నారు.

చవితి పందిళ్లకు అనుమతి సులభతరం

● పోలీస్ కమిషనర్ రాజశేఖరబాబు

విజయవాడ సిటీ, ఆగస్టు 23(ఆంధ్రజ్యోతి) : వినాయక చవితి పందిళ్లకు సింగిల్ విండో విధానంలో అనుమతులు మంజూరు చేస్తున్నట్లు పోలీస్ కమిషనర్ ఎస్.వి.రాజశేఖరబాబు ప్రకటించారు. పందిళ్ల ఏర్పాటునకు ఎలాంటి రుసుం చెల్లించాల్సిన అవసరం లేదని స్పష్టం చేశారు. https://ganeshutsav.net వెబ్‌సైట్‌లో దరఖాస్తుదారుని పేరు, మొబైల్ నెంబర్, ఈ-మెయిల్ ఐడీ, చిరునామా, అసోసియేషన్/కమిటీ పేరు, పందిరి ఏర్పాటు చేసే స్థలం వివరాలు, విగ్రహం ఎత్తు, మండపం ఎత్తు, పోలీస్ సబ్ డివిజన్, పోలీస్ స్టేషన్, ఉత్సవ కమిటీ సభ్యుల పేర్లు, నిమజ్జనం తేదీ, సమయం, వాహన వివరాలు నమోదు చేయాలని సూచించారు. అనంతరం ఆన్‌లైన్ ద్వారానే మంజూరైన ఎన్‌వోసీని డౌన్‌లోడ్ చేసుకుని తనిఖీ నిమిత్తం వచ్చే అధికారులకు చూపించాల్సి ఉంటుందన్నారు. పందిళ్ల వద్ద తాత్కాలిక సీసీ కెమెరాలను ఏర్పాటు చేయాలన్నారు. అనుమతి లేకుండా పందిళ్ల ఏర్పాటు చేయొద్దని, డీజే, అధిక శబ్దం చేసే సౌండ్ సిస్టం వినియోగించొద్దని సూచించారు.

మ్యూల్ మాయలోడు శరణ్

అతడి వయస్సు 30 ఏళ్లు. రెండు నెలల వ్యవధిలో అతడు బ్యాంక్ ఖాతాల ద్వారా చేయించిన లావాదేవీలు రూ.500 కోట్లు అతడే విజయవాడకు చెందిన వడ్డేవల్లి లలిత శరణ్‌కుమార్. అతడు ఏదో కంపెనీకి సీఈవో అనుకుంటే పొరపాటే. నిత్యం దేశ వ్యాప్తంగా ఎవరో ఒకరి ఖాతాలను ఖాళీ చేయిస్తున్న 'ఈ' నేరగాళ్లకు ఖాతాల లింక్‌ను కలిపాడు. సైబర్ నేరగాళ్లతో చేతులు కలిపి వారికి బ్యాంక్ ఖాతా (మ్యూల్ అకౌంట్ల) ను ఏర్పాటు చేశాడు. విదేశంలో ఉంటూ భారతీయ బ్యాంక్ ఖాతాలను తెరిపిస్తున్న అతడిని తెలంగాణ సైబర్ క్రైం బ్యూరో పోలీసులు అరెస్టు చేశారు.

(ఆంధ్రజ్యోతి - విజయవాడ)

శరణ్ కొంతకాలంగా దుబాయ్‌లో ఉంటున్నాడు. అక్కడ ఉద్యోగం చేస్తున్నట్టుగా కుటుంబ సభ్యులను నమ్మించాడు. దుబాయ్‌లో సైబర్ నేరగాళ్లతో జత కట్టాడు. వారికి అవసరమైన బ్యాంక్ ఖాతాలు సమకూర్చడానికి ఏజెంట్‌గా మారాడు. రెండు తెలుగు రాష్ట్రాల్లో తన కింద ఏజెంట్లను నియమించుకున్నాడు. డిజిటల్ అరెస్టుల పేరుతో బెదిరించి, ఇంటి నుంచే ఉద్యోగం చేసే అవకాశాలు కల్పిస్తామని నమ్మించి, తక్కువ పెట్టుబడితో ఎక్కువ లాభాల ఆశలు కల్పించి ప్రజల నుంచి లక్షలాది రూపాయలను లాగేసుకుంటున్న ముసుగు వేసుకున్న మోసగాళ్లకు వందల సంఖ్యలో బ్యాంక్ ఖాతాలను సమకూర్చాడు. దుబాయ్ నుంచి నెలకు ఒకసారి విజయవాడకు చేరుకునేవాడు. రెండు తెలుగు రాష్ట్రాల్లో ఉన్న కూలీలు, యాచకులు, నిరుపేదలతో బ్యాంకుల్లో మ్యూల్ ఖాతాలను తెరిపించే వాడు. ఈ ఖాతాలు తెరవడానికి అవసరమైన వ్యక్తులను సమకూర్చడానికి ఏజెంట్లను నియమించుకున్నాడు. ఈ నేరగాళ్లు అమలు చేసిన టాస్క్ మేరకు ఈ ఖాతాల్లో జమ అయిన డబ్బుల నుంచి ఖాతాదారులకు, ఏజెంట్లకు కొంత మొత్తంలో కమీషన్లు చెల్లించేవాడు. ఈ నేరగాళ్ల నుంచి పెద్దమొత్తంలో కమీషన్‌ను శరణ్ కుమార్ తీసుకునేవాడు.

● రూ.500 కోట్ల సైబర్ క్రైమ్‌కు అద్యుడు

నేపాల్‌లో దిగి...

తెలంగాణ సైబర్ క్రైం బ్యూరో క్రైం నంబరు 28/2024తో నమోదు చేసిన కేసులో శరణ్ కుమార్ మూడో నిందితుడు. ఈ కేసులో ఖాతాలు తెరిచిన వారితో కలిసి ఆరుగురు నిందితులను, ఇద్దరు ఏజెంట్లను, హైదరాబాద్‌లోని శంషేర్ గంజ్ ఎస్‌బీఐ మేనేజర్‌ను అరెస్టు చేశారు. అప్పటి నుంచి తెలంగాణ సైబర్ క్రైం బ్యూరో పోలీసులు శరణ్ కుమార్ కోసం ఎదురు చూస్తున్నారు. శరణ్‌కుమార్ పాస్‌పోర్టు వివరాలు తెలుసుకుని లుక్ అవుట్ సర్క్యూలర్ జారీ చేశారు. ఈ విషయం తెలుసుకున్న అతడు పోలీసులకు చిక్కకుండా ఉండేలా ఎత్తులు వేశాడు. సైబర్ నేరగాళ్లకు అవసరమైన మ్యూల్ ఖాతాలను సమకూర్చడానికి దుబాయ్ నుంచి రెండు రోజుల క్రితం బయలుదేరాడు. వాస్తవానికి అతడు దేశంలో ఉన్న అంతర్జాతీయ విమానాశ్రయాల్లో దిగాలి. ఇక్కడ దిగితే పోలీసులకు చిక్కడం ఖాయమని భావించిన శరణ్ కుమార్ నేపాల్ దేశంలో దిగాడు. శరణ్‌కుమార్ బయలుదేరిన విషయం భారత రాయబార కార్యాలయంలో తెలంగాణ సైబర్ క్రైం బ్యూరోకు సమాచారం ఇచ్చింది. దీనితో పోలీసులు అప్రమత్తమయ్యారు. శరణ్‌కుమార్ నేపాల్ విమానం దిగి కారులో రోడ్డుమార్గంలో ఇండియాకు బయలుదేరాడు. అతడిని ఉత్తరాఖండ్ వద్ద తెలంగాణ పోలీసులు పట్టుకున్నారు. శరణ్ కుమార్ తెరిపించిన మ్యూల్ ఖాతాల ద్వారా రెండు నెలల్లో రూ.500 కోట్ల లావాదేవీలు జరిగినట్టు గుర్తించారు.

విజయ దరహాసం

(3వ పేజీ తరువాయి)

విడుదల కాకపోవడంతో బీఈడీ, టీటీసీ కోర్సులు చదివిన వారు ఉద్యోగం పొందేందుకు అవకాశం లేకుండా నిరుద్యోగులుగానే ఉండిపోయారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి రాగానే నిరుద్యోగుల కల నెరవేర్చింది.

వీఆర్ఏ నుంచి స్కూల్ అసిస్టెంట్‌గా..

మోపిదేవి ప్రజాశక్తినగర్‌కు చెందిన పోలిమెట్ల స్వయం ప్రభ మోపిదేవి రెవెన్యూ విభాగంలో వీఆర్ఏగా ఉద్యోగం చేస్తూ సోషల్ స్టడీస్‌లో స్కూల్ అసిస్టెంట్ ఉద్యోగం కోసం డీఎస్సీ రాయగా, 76.94 మార్కులతో జిల్లాస్థాయిలో 20వ ర్యాంకు సాధించింది.

విధిని ఎదిరించిన జయకృష్ణ

మచిలీపట్నం ఫతుల్లాబాద్‌కు చెందిన మొవ్వ జయకృష్ణకు నాలుగేళ్ల వయసున్నపుడే తల్లిదండ్రులు ప్రసాద్, రాణి మరణించారు. నానమ్మ నాగచింతమ్మ పెంచి పెద్ద చేసింది. పట్టుదలతో చదువుకున్న జయకృష్ణ విధిని ఎదిరించి నిలిచాడు. మెగా డీఎస్సీలో సెకండరీ గ్రేడ్ టీచర్(ఎస్‌జీటీ) కోటాలో జిల్లాలో 199వ ర్యాంకు సాధించాడు.

రూ.22 లక్షలు బొక్కేశారు..

(3వ పేజీ తరువాయి)

లెక్క చూపటం అవినీతి, అక్రమాలకు పరాకాష్ఠగా నిలుస్తోంది. గరికపర్రులో ఎక్స్‌కవేటర్‌తో మట్టి తవ్వితే అది కూలీలు తవ్వినట్టు చూపటం జరిగింది. కుమ్మమూరు, యాకమూరు గ్రామాల సిబ్బంది ఒకే పంట కాలువకు రెండు పేమెంట్లు చేయటం, ఎం బుక్‌లలో కంటే అధికంగా డబ్బులు చెల్లించటం తదితర అంశాలు అక్రమాలుగా తేలాయి.

అక్రమార్కుడికి మళ్లీ ఉద్యోగం

మే 5వ తేదీన మండల పరిషత్ కార్యాలయంలో భద్రిరాజుపాలెం ఎఫ్ఏ కిరణ్‌కుమార్ కుర్చీ, టేబుల్ వేసుకుని ఉపాధి హామీ పత్రాల్లో కూలీల సంతకాలు చేస్తూ మీడియాకు చిక్కాడు. గంటసేపు కూలీల పేర్లు రాసి, కూలీల వేలిముద్రలు తనే వేశాడు. దీనికి సంబంధించిన ఫొటోలు, వీడియోలు కూడా ఉన్నాయి. ఇలా వేయవచ్చని, తప్పేమి లేదని ఆ ఎఫ్ఏ చెప్పటం జరిగింది. దీనిపై గతంలో 'ఆంధ్రజ్యోతి' కథనం ప్రచురించగా, మే 7వ తేదీన అంబుడ్స్‌పర్సన్ శ్రీనివాసరావు భద్రిరాజుపాలెం వచ్చి విచారణ జరిపారు. ఆ విచారణకు ఎఫ్ఏ బంధువులు, అనుకూలమైన కూలీలను మాత్రమే తీసుకొచ్చి విచారణ జరిపారు. తర్వాత సస్పెండ్ చేసి మళ్లీ అతనికి ఎఫ్ఏ పోస్టు ఇచ్చారు. ఈ ఎఫ్ఏ కిరణ్‌కుమార్ గతంలో ఒకసారి సస్పెండ్ అయి రూ.40 వేలు రికవరీ కట్టిన చరిత్ర ఉంది. రూ.10 వేలకు మించి రికవరీ కట్టిన ఎఫ్ఏని రెండవ సారి ఉద్యోగంలోకి తీసుకోకూడదన్న నిబంధనను ఉన్నతాధికారి పక్కనపెట్టి ఎఫ్ఏ పోస్టు ఇవ్వటం మిగతా సిబ్బందికి ఎలాంటి సంకేతం ఇస్తున్నారో ఆలోచించుకోవాలి.



బ్రాయిలర్ ధరలు

అమరావతి	(రూ.లలో)
బ్రాయిలర్ బర్డ్	110, 118, 129
చికెన్ విత్ స్కిన్	210
చికెన్ స్కిన్‌లెస్	220

నెక్ కోడిగుడ్ల ధర (100)

విజయవాడ జోన్ రైతు ధర రూ. 535

కానుమోలు హైస్కూల్‌కు రావాలని ఎస్పీకి ఆహ్వానం



హనుమాన్‌జంక్షన్‌రూరల్, ఆగస్టు 23 (ఆంధ్రజ్యోతి) : ఉపాధ్యాయ వృత్తి నుంచి ఐపీఎస్ సాధించి జిల్లా ఎస్పీగా సేవలందిస్తున్న ఆర్.గంగాధర రావును విద్యార్థులకు ప్రేరణ కల్పించేందుకు కానుమోలు హైస్కూల్‌ను సందర్శించాలని పూర్వ విద్యార్థులు కోరారు. బందరు కార్యాలయంలో జిల్లా ఎస్పీ ఆర్. గంగాధరరావును కానుమోలు హైస్కూల్ పూర్వ విద్యార్థులు శనివారం మర్యాద పూర్వకంగా కలిసి మొక్కను అందజేశారు. పూర్వవిద్యార్థులు చింతల వెంకటశివ అప్పారావు, వేగిరెడ్డి బాలాజీ, వేగిరెడ్డి అప్పారావు తదితరులు పాల్గొన్నారు.

స్త్రీ శక్తి పథకానికి అపూర్వ స్పందన

గన్నవరం, ఆగస్టు 23 (ఆంధ్రజ్యోతి) : ప్రభుత్వం అమలు చేసిన స్త్రీ శక్తి పథకానికి అపూర్వ స్పందన లభిస్తుందని ఏపీఎస్ ఆర్టీసీ అధికారి కె.వెంకటేశ్వర్లు అన్నారు. స్థానిక ఆర్టీసీ డిపోను శనివారం ఆయన పరిశీలించి ఏవోలు, కండక్టర్‌లతో మాట్లాడారు. బస్సులను పరిశీలించి తగిన సూచనలు చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ, డిపోలోని 61బస్సులకు గాను 51బస్సులకు మహిళలకు కేటాయించినట్లు తెలిపారు. ఈ 8రోజులలో 11వేల మంది మహిళలు ఉచిత బస్సును సద్వినియోగం చేసుకున్నట్లు తెలిపారు.

టంగుటూరి నేటి యువతకు స్ఫూర్తి

హనుమాన్‌జంక్షన్‌రూరల్, ఆగస్టు 23(ఆంధ్రజ్యోతి) : దేశం కోసం న్యాయవాద వృత్తిని త్యాగం చేసి సైమన్ కమిషన్ వ్యతిరేక నిరసనలో బుల్లెట్లకు ఎదురొడ్డి నిలచిన టంగుటూరి ప్రకాశంపంతులు ధైర్యపోరాటాలే యువతకు స్ఫూర్తిదాయకమని హెచ్‌ఎం దోనె శ్రీహరిరావు విద్యార్థులకు తెలిపారు. మడిచర్ల ఎంపీపీ స్కూల్‌లో శనివారం ఆంధ్రకేసరి టంగుటూరి ప్రకాశం పంతులు జయంతి సందర్భంగా చిత్రపటానికి విద్యార్థులతో కలిసి ఉపాధ్యాయులు నివాళులర్పించారు.

హనుమాన్‌జంక్షన్ : స్వాతంత్ర్య ఉద్యమ పోరాటంలో ఆంధ్రకేసరి ప్రకాశం పంతులు చూపిన ధైర్యసాహసాలు ఎప్పటికీ స్ఫూర్తిదాయకమని మానవత రాష్ట్ర అధ్యక్షుడు మారుబోయిన కోటేశ్వరరావు అన్నారు. ఏలూరు రోడ్డులోని మానవత కార్యాలయంలో శనివారం టంగుటూరి ప్రకాశం పంతులు జయంతి వేడుకను నిర్వహించారు. ప్రకాశం పంతులు చిత్రపటం వద్ద నివాళులు అర్పించారు.

ముగిసిన శ్రావణమాస ఉత్సవాలు

గన్నవరం, ఆగస్టు 23 (ఆంధ్రజ్యోతి) : పాతగన్నవరంలోని శ్రీలక్ష్మీ తిరుపతమ్మ ఆలయంలో గత నెల రోజులుగా జరుగుతున్న శ్రావణమాస ఉత్సవాలు శనివారం ఘనంగా ముగిశాయి. ఈ సందర్భంగా జరుగుతున్న శ్రీలక్ష్మీ సహస్ర నామార్చనలకు కలశ ఉద్వాసన పలికారు. తొలుత శ్రీలక్ష్మీతిరుపతమ్మ సమేత గోపయ్య స్వామికి విశేష అలంకరణలు, ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం ఆలయ ప్రాంగణంలోని మాను(మహాలక్ష్మీ)కు పూజలు, అమ్మవారికి పాల పొంగళ్లను సమర్పించారు. అమ్మవారిని ఏఎంసీ చైర్మన్ గూడవల్లి నరసింహారావు, పలువురు డైరెక్టర్లు దర్శించుకున్నారు. అనంతరం రుత్వికులను ఆలయ కమిటీ అధ్యక్షులు జాస్తి శ్రీధర్ సత్కరించారు.

పీవీపీ సిద్ధార్థ కళాశాలలో ఫుడ్ ఫెస్ట్

కానూరు, ఆగస్టు 23 (ఆంధ్రజ్యోతి) : కానూరులోని పీవీపీ సిద్ధార్థ ఇంజనీరింగ్ కళాశాలలో శనివారం విద్యార్థుల్లో తెలుగు సంప్రదాయాన్ని ప్రోత్సహించేందుకు టేస్ట్‌యూ ఆఫ్ తెలుగు టాంగ్స్ పేరున ఫుడ్ ఫెస్టివల్ జరిగింది. ఈ కార్యక్రమంలో తెలుగు రాష్ట్రాల సంప్రదాయ వంటకాలు, దుస్తులు, సంస్కృతి ప్రదర్శనలు ప్రధాన ఆకర్షణగా నిలిచాయి. ఈ సందర్భంగా డాక్టర్ విక్రమ్ అన్నమనేని గట్ హెల్త్ అనే అంశంపై ఉపన్యసించారు. ప్రిన్సిపాల్ డాక్టర్ కొండపల్లి శివాజీబాబు, హెచ్‌వోడీ శ్రీలక్ష్మి, డాక్టర్ ప్రీతి రంగమణి, డాక్టర్ తులసీ తదితరులు పాల్గొన్నారు. ఈసందర్భంగా డాక్టర్ విక్రమ్ అన్నమనేనిని కళాశాల ప్రిన్సిపాల్ శివాజీబాబు శాలువాతో సత్కరించారు.

ఘనంగా శ్రీసాయి గీతా మందిర వార్షికోత్సవం



ప్రసాదంపాడు, ఆగస్టు 23 (ఆంధ్రజ్యోతి) : ఎనికేపాడు కె.వి.ఆర్ కాలనీలోని శ్రీసాయి గీతామందిర 21 వార్షికోత్సవ వేడుకలు శనివారం ఘనంగా నిర్వహించారు. ఉదయం 7 గంటల నుంచి పంచామృత అభిషేకాలు, అన్నాభిషేకం వంటి క్రతువులు నిర్వహించారు. ఆలయ కమిటీ అధ్యక్షులు దాసరి రామమోహనరావు, కార్యదర్శి సుంకవల్లి రాజారావు, కోశాధికారి తుమ్మల వి.వి.ఎస్.వి ప్రసాద్‌లు వార్షికోత్సవ మహోత్సవ కార్యక్రమాన్ని పర్యవేక్షించారు. సుమారు 3000 మంది భక్తులకు అన్నసమారాధనను ఏర్పాటు చేశారు.

హత్య కేసు నిందితుడి అరెస్టు

పెనమలూరు, ఆగస్టు 23 (ఆంధ్రజ్యోతి) : గత ఏప్రిల్‌లో పెనమలూరు మహిళ మండలి కట్ట వద్ద డేరంగుల పిచ్చయ్య అనే వ్యక్తితో గొడవ పడి అతడిని హత్య చేసి పరారైన నిందితుడు విపిన్ సాహ్నీ అనే యువకుడిని శనివారం పెనమలూరు పోలీసులు అరెస్టు చేశారు. ఇప్పటికే ఈ హత్య కేసులో వేల్పుల రమణ అనే వ్యక్తిని గతంలో పోలీసులు అరెస్టు చేసి రిమాండుకు తరలించగా మిగిలిన నిందితులను ఇంకా అరెస్టు చేయాల్సి ఉందని పోలీసులు తెలిపారు.



కుమారస్వామిని అభినందిస్తున్న బీజేపీ నాయకులు

అంకితభావంతో పనిచేస్తే గుర్తింపు

గన్నవరం, ఆగస్టు 23 (ఆంధ్రజ్యోతి): పార్టీలో అంకితభావంతో పని చేసిన వారికి సముచిత స్థానం లభిస్తుందని అందుకు నిదర్శనం చిగురుపాటి కుమారస్వామి అని బీజేపీ మండల అధ్యక్ష కార్యదర్శులు నీలం అశోక్, వెంకటకృష్ణ అన్నారు. స్థానిక బీజేపీ కార్యాలయంలో సీనియర్ నాయకులు చిగురుపాటి కుమారస్వామికి రాష్ట్ర కిసాన్ మోర్చా అధ్యక్షుడిగా నియమించటంతో శనివారం కేక్ కట్ చేసి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా కుమారస్వామి మాట్లాడుతూ, కష్టపడి పని చేసే వారికి మంచి గుర్తింపు లభిస్తుందని తెలిపారు. నాయకులు ప్రసాద్, కానూరు శేషు మాధవి, ఫణికుమార్, మల్లికార్జునరాజు, దుర్గా ప్రసాద్, వెంకటేశ్వరరెడ్డి పాల్గొన్నారు.

నేడు కానుమోలులో వైద్యశిబిరం

హనుమాన్‌జంక్షన్‌రూరల్, ఆగస్టు 23 (ఆంధ్రజ్యోతి) : కానుమోలు హైస్కూల్ ఆవరణలో ఆదివారం ఉదయం నిర్వహించే ఉచిత వైద్యశిబిరాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని రైస్ మిల్లర్స్ అసోసియేషన్ నాయకులు శనివారం కోరారు. ది హనుమాన్ జంక్షన్ ఏరియా రైస్ మిల్లర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో డాక్టర్ శివప్రసాద్ హృదయాలయ వారి సహకారంతో ఈసీజీ, 2డి ఎకో ఆర్‌బీఎస్ లాంటి గుండెకు సంబంధించి వైద్య పరీక్షలు ఉచితంగా నిర్వహించనున్నట్లు వివరించారు. జనరల్, దంత, గుండెకు సంబంధించి వివిధ పరీక్షలు నిర్వహిస్తారని, పూర్వ వైద్య పరీక్షల రికార్డులను కూడా ప్రజలు తమ వెంట తీసుకురావాలని వారు సూచించారు.



ఫార్మా సంస్థల్లో ఉద్యోగాలు సాధించిన అభ్యర్థులతో ప్రతినిధులు

యువత క్రమశిక్షణతో ఎదగాలి

ఉంగుటూరు, ఆగస్టు 23 (ఆంధ్రజ్యోతి) : ఫార్మా రంగంలో యువత క్రమశిక్షణతో ఎదగాలని ఎల్ఎస్ఎస్ఎస్‌డీసీ సీఈవో గౌతం భట్టాచార్య, స్వర్ణభారత్‌ట్రస్ట్ సీఈవో శరత్‌బాబు ఆకాంక్షించారు. మొదటి బ్యాచ్‌కు స్నాతకోత్సవం, రెండవ బ్యాచ్‌కు ప్రారంభోత్సవం కార్యక్రమం శనివారం ట్రస్ట్ ప్రాంగణంలోని ముప్పవరపు ఫౌండేషన్ మీటింగ్ హాలులో ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో కోహేన్స్ లైఫ్ సైన్సెస్ లిమిటెడ్ ప్రతినిధి పీఎస్ఎన్ మూర్తి, ఫార్మా మ్యానుఫాక్చరింగ్ స్కిల్‌సెంటర్ ప్రతినిధి ఎం.ఉదయకృష్ణ, వివిధ ఫార్మాసంస్థలకు చెందిన ప్రతినిధులు పాల్గొన్నారు.

ఎమ్మార్పీఎస్ బలోపేతానికి కృషిచేయాలి

ఉంగుటూరు, ఆగస్టు 23 (ఆంధ్రజ్యోతి) : ఎమ్మార్పీఎస్‌ను బలోపేతం చేసేందుకు నూతనంగా ఎంపికైన గ్రామకమిటీలు కృషి చేయాలని ఎమ్మార్పీఎస్ గన్నవరం నియోజకవర్గ ఇన్‌చార్జి మందా వేణు అన్నారు. ఇందుపల్లిలో జరిగిన సమావేశంలో నూతన కమిటీ ఎన్నిక జరిగింది. ఇందులో నూతన కమిటీ ఎన్నిక జరిగింది.

• పురస్కార గ్రహీతలకు సత్కారం



విశిష్ట సేవలకు పురస్కారాలు, కరాటే పోటీల్లో పతకాలు సాధించిన విద్యార్థులకు సాత్విక్ యోగా శిక్షణ కేంద్రం ఆధ్వర్యంలో శనివారం ఘనంగా సత్కరించారు. - ఉయ్యూరు

చెట్లను పెంచుదాం.. పర్యావరణాన్ని కాపాడుదాం

స్వచ్ఛాంధ్ర- స్వర్ణాంధ్ర కార్యక్రమంలో ఎమ్మెల్యే బోడె ప్రసాద్



చోడవరంలో మొక్కలు నాటి నీళ్లు పోస్తున్న ఎమ్మెల్యే బోడె ప్రసాద్

పెనమలూరు, ఆగస్టు 23 (ఆంధ్రజ్యోతి) : మానవజాతి మనుగడకు, ఆరోగ్యానికి అత్యవసరమైన చెట్లను పంచి పర్యావరణాన్ని కాపాడుకుందామని ఎమ్మెల్యే బోడె ప్రసాద్ అన్నారు. శనివారం పోరంకి, చోడవరం గ్రామాల్లో స్థానిక టీడీపీ కూటమి నేతలతో కలిసి స్వచ్ఛాంధ్ర స్వర్ణాంధ్ర కార్యక్రమంలో ఎమ్మెల్యే పాల్గొని మొక్కలను నాటి స్థానికులతో మాట్లాడారు. చెట్లను విచక్షణారహితంగా నరకడం వల్ల పర్యావరణ సమతుల్యత దెబ్బ తింటుందని, దీనివల్ల మనం భవిష్యత్తు తరాలకు స్వచ్ఛమైన గాలి, నీరు ఇవ్వలేమని తెలిపారు. కార్యక్రమంలో ఎంపీడీఓ ప్రణవి, కమిషనర్ షేక్ నజీర్, టీడీపీ కూటమి నాయకులు అనుమోలు ప్రభాకరరావు, మారుపూడి ధనకోటేశ్వరరావు, కోయ ఆనంద్‌ప్రసాద్, చోడవరం గ్రామ టీడీపీ అధ్యక్షుడు కలపాల శ్రీధర్, సంగెపు రంగారావు, సర్పంచి కాకర్ల వెంకటరత్నం, దొండపాటి సురేష్, వెలిసెల రఘు, దండమూడి సాయిసుధ, మల్లంపాటి విజయలక్ష్మి, సింహాద్రి కృష్ణవేణి తదితరులు పాల్గొన్నారు.

పరిసరాల పరిశుభ్రతపై అవగాహన

ఉయ్యూరు : పరిసరాల పరిశుభ్రత పాటించి స్వర్ణాంధ్ర- స్వచ్ఛాంధ్ర సాధనలో అందరూ భాగస్వాములు కావాలని ఎంపీడీవో జీఎస్‌వి శేషగిరిరావు అన్నారు. స్వర్ణాంధ్ర- స్వచ్ఛాంధ్ర కార్యక్రమంలో భాగంగా శనివారం ఆకునూరులో పరిశుభ్రతపై అవగాహన ర్యాలీ నిర్వహించి, ప్రతిజ్ఞ చేయించారు. సర్పంచ్ గోలి వసంత కుమార్, ఏఎంసీ చైర్మన్ కొండా ప్రవీణ్‌కుమార్, అసిస్టెంట్ ఎంపీడీవో కోటేశ్వరరావు, టీడీపీ నాయకులు వెంకన్న, కాకాని శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు. ఉయ్యూరు ప్రభుత్వ వైద్యశాలలో స్వర్ణాంధ్ర- స్వచ్ఛాంధ్ర కార్యక్రమం నిర్వహించి నీటి ద్వారా, దోమల ద్వారా వచ్చే వ్యాధులు- నివారణ, వ్యక్తిగత, పరిసరాల పరిశుభ్రతపై వైద్యులు అవగాహన కల్పించారు. వైద్యశాల అడ్వయిజరీ కమిటీ చైర్మన్ మండవ జయదేవ్, డాక్టర్ మురళి, రోహిణి, వైద్యశాల సిబ్బంది పాల్గొన్నారు.



ఆకునూరులో స్వర్ణాంధ్ర- స్వచ్ఛాంధ్ర ప్రతిజ్ఞ చేస్తున్న ఎంపీడీవో శేషగిరిరావు, సర్పంచ్ వసంతకుమార్



వీరవల్లి పోలీస్‌స్టేషన్‌ను శుభ్రపరుస్తున్న ఎస్సై శ్రీనివాస్, సిబ్బంది

వీరవల్లిలో పోలీసుల స్వచ్ఛాంధ్ర శ్రమదానం

హనుమాన్‌జంక్షన్‌రూరల్ : పరిసరాల పరిశుభ్రతతోనే చక్కని ఆరోగ్యం సాధ్యమని తెలుపుతూ పరిసరాలు పరిశుభ్రంగా ఉంచుకోవాలని ఎస్సై శ్రీనివాస్ అన్నారు. వీరవల్లి పోలీస్‌స్టేషన్‌లో రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన స్వర్ణాంధ్ర-స్వచ్ఛ ఆంధ్ర కార్యక్రమాన్ని శనివారం నిర్వహించారు. ఎస్సై శ్రీనివాస్‌తో కలిసి పోలీసు సిబ్బంది పోలీస్‌స్టేషన్ ఆవరణ, వాహనాల పార్కింగ్ స్థలాన్ని, సిబ్బంది క్వార్టర్స్ పరిసరాలను, రికార్డు గదులను శుభ్రపరిచారు.

ఎస్సీ, ఎస్టీల అభ్యున్నతి టీడీపీతోనే సాధ్యం



కంకిపాడు, ఆగస్టు 23 (ఆంధ్రజ్యోతి) : ఎస్సీ, ఎస్టీల అభ్యున్నతి తెలుగుదేశం పార్టీతోనే సాధ్యమని ఉయ్యూరు మార్కెట్ యార్డ్ చైర్మన్ కొండా ప్రవీణ్‌కుమార్ అన్నారు. ఇటీవల ఎస్సీ, ఎస్టీ వెల్ఫేర్ అండ్ మానటరింగ్ కమిటీ సభ్యుడిగా ప్రమాణ స్వీకారం చేసిన కొండా నాగేశ్వరరావును శనివారం ఆయన ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా కొండా ప్రవీణ్ మాట్లాడుతూ, ఎస్సీ సామాజిక వర్గానికి చెందిన తనను ఉయ్యూరు మార్కెట్ యార్డ్ చైర్మన్‌గా ఎమ్మెల్యే బోడె ప్రసాద్ నియమించారని అదే ఎస్సీలకు టీడీపీ ఇచ్చే సముచిత స్థానం అని గుర్తుచేశారు. ఈ కార్యక్రమంలో ఏఎంసీ డైరెక్టర్ గోగినేని వెంకటరమణ, పావనమూర్తి, కొండవీటి శివయ్య, వణుకూరు విక్రం, చలసాని రాధాకృష్ణమూర్తి, లాం సురేష్, పడవల మధుసూదనరావు, బొర్రా వెంకట్, తిరుపతయ్య పాల్గొన్నారు.

చవితి పందిళ్ల నిర్వహణకు అనుమతులు తప్పనిసరి

గన్నవరం డీఎస్పీ చలసాని శ్రీనివాసరావు

పెనమలూరు, ఆగస్టు 23 (ఆంధ్రజ్యోతి) : వినాయకచవితి పందిళ్ల నిర్వాహకులు పోలీసు శాఖ వద్ద తప్పనిసరిగా అనుమతులు తీసుకోవాలని గన్నవరం డీఎస్పీ చలసాని శ్రీనివాసరావు అన్నారు. శనివారం పెనమలూరు పోలీసుస్టేషన్లో వినాయక చవితి పందిళ్ల నిర్వాహకులతో ఆయన సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ, ఇప్పటివరకు 150మంది నిర్వాహకులు తమ శాఖ వద్ద అనుమతులు తీసుకొన్నారని, వేగిరమే అనుమతులు మంజూరు చేసేందుకు సింగిల్ విండో విధానాన్ని అమలు చేస్తున్నామని, పందిళ్ల వద్ద తప్పనిసరిగా సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకోవాలని సూచించారు. సమావేశంలో సీఐ వెంకటరమణ, ఎస్సైలు, సిబ్బంది పాల్గొన్నారు.

ఉయ్యూరు : వినాయక చవితి ఉత్సవాలు నిర్వహించేవారు నిబంధనలు తప్పనిసరిగా పాటించాలని, ఏవిధమైన సంఘటనలు జరిగినా కమిటీదే బాధ్యత అని ఉయ్యూరు పట్టణ సీఐ టీవీవీ రామారావు అన్నారు. పట్టణ పరిధిలో వినాయక చవితి ఉత్సవాల నిర్వాహకులు, డీజే, మైక్ లైటింగ్ సర్వీసుల వారితో శనివారం సమావేశం నిర్వహించి పలు సూచనలు చేశారు. డీజే బాక్స్‌లు పెడితే సీజ్‌చేసే బాక్స్‌లు పెట్టిన వారిపై కేసు నమోదు చేస్తామని హెచ్చరించారు. ఏఎస్ఐ వసంతకుమార్ పాల్గొన్నారు.



వినాయక చవితి పందిళ్ల నిర్వాహకులతో మాట్లాడుతున్న డీఎస్పీ శ్రీనివాసరావు, సీఐ వెంకటరమణ

ప్రతి ఒక్కరూ మట్టి వినాయక విగ్రహాలను పూజించాలి

ఎమ్మెల్యే బోడె ప్రసాద్

కానూరు, ఆగస్టు 23 (ఆంధ్రజ్యోతి) : పర్యావరణ పరిరక్షణకు మట్టి వినాయక విగ్రహాలను ప్రతిఒక్కరూ పూజించాలని ఎమ్మెల్యే బోడె ప్రసాద్ అన్నారు. కానూరులోని సిద్ధార్థ డీమ్డ్ యూనివర్సిటీ ఆవరణలో శనివారం వర్సిటీ ఎకో క్లబ్, పీవీపీ సిద్ధార్థ ఇంజనీరింగ్ కళాశాల, లిటిల్ హ్యాండ్స్ ఆర్గనైజేషన్ సంయుక్త ఆధ్వర్యంలో పర్యావరణ అనుకూల గణేష్ విగ్రహాల తయారీ కార్యక్రమం జరిగింది. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే పాల్గొని విద్యార్థులు తయారు చేసిన గణేష్ మట్టి విగ్రహాలను పరిశీలించి వారిని అభినందించారు. ఆయన మాట్లాడుతూ, గణేష్ మట్టి విగ్రహాల కార్యక్రమంలో పాల్గొనడం ఆనందంగా ఉందన్నారు. వర్సిటీ ప్రొ. వీసీ ఏవీ రత్నప్రసాద్ మట్టి గణేష్ విగ్రహాల ప్రాధాన్యతను వివరించారు. కార్యక్రమంలో రిజిస్ట్రార్ ఎం. రవిచంద్, డాక్టర్ కె. నరేంద్ర, డాక్టర్ కవిత పాల్గొన్నారు.



సిద్ధార్థ వర్సిటీ ఆవరణలో మట్టి వినాయక విగ్రహాలను తయారు చేస్తున్న విద్యార్థులు



పర్వతారోహకుడు అనుమోలు ప్రభాకరరావును అభినందిస్తున్న కలెక్టర్ బాలాజీ, ఎమ్మెల్యే బోడె ప్రసాద్

పర్వతారోహకుడు అనుమోలుకు కలెక్టర్ అభినందనలు

పెనమలూరు, ఆగస్టు 23 (ఆంధ్రజ్యోతి): యూరప్‌లోని అత్యున్నత శిఖరం మౌంట్ ఎల్బ్రస్‌ను తన 67 ఏళ్ల వయస్సులో అధిరోహించిన పోరంకికి చెందిన వయోజ్ఞుడు అనుమోలు ప్రభాకరరావును కృష్ణాజిల్లా కలెక్టర్ డీకే బాలాజీ అభినందించారు. ఈనెల 6న 5642 మీటర్ల ఎత్తయిన మౌంట్ ఎల్బ్రస్‌ను పోరంకి వాసి బొబ్బా గోపాలకృష్ణతో కలిసి ప్రభాకరరావు అధిరోహించిన విషయం తెలుసుకొన్న కలెక్టర్ శనివారం ఆయనను మచిలీపట్నంలోని తన కార్యాలయానికి పిలిపించుకొని పర్వతారోహణలో ప్రభాకరరావు అనుభవాలను అడిగి తెలుసుకొన్నారు. 2023లో తాను ఆఫ్రికాలోని కిలిమంజారో పర్వతాన్ని అధిరోహించానని, 2024లో ఎవరెస్టు బేస్ క్యాంపును చేరుకున్నట్టు అనుమోలు కలెక్టర్‌కు తెలిపారు. పర్వతారోహణలో ఎన్నో మైలురాళ్లను స్థాపించిన అనుమోలును దుశ్శాలువతో సత్కరించారు. 67ఏళ్ల వయస్సులో అవలీలగా ప్రపంచంలోని ఎత్తైన పర్వతాలను అధిరోహిస్తున్న ప్రభాకరరావు యువతకు స్ఫూర్తిగా నిలుస్తున్నారని మెచ్చుకున్నారు. అలాగే ఎమ్మెల్యే బోడె ప్రసాద్, తాడిగడప మునిసిపల్ కమిషనర్ షేక్ నజీర్, టీడీపీ పెనమలూరు మండలాధ్యక్షుడు కోయ ఆనంద్‌ప్రసాద్, చిన్నారి తదితరులు ఆయన్ను అభినందించారు.

వంశీకి ఒకరోజు మినహాయింపు

హనుమాన్‌జంక్షన్, ఆగస్టు 23 (ఆంధ్రజ్యోతి): కోర్టు కండిషన్ బెయిల్‌లో భాగంగా పోలీస్ స్టేషన్‌లో వారానికి రెండు (బుధ, శని) రోజులు పాటు సంతకాలు చేయాల్సిన మాజీ ఎమ్మెల్యే వల్లభనేని వంశీకి ఒక రోజు మినహాయింపు వచ్చింది. ఇక నుంచి శనివారం ఒక్కరోజు మాత్రమే పోలీస్ స్టేషన్‌కు హాజరు కావల్సి ఉంది. ఈ మేరకు కోర్టు నుంచి తీసుకున్న మినహాయింపు ఉత్తర్వు కాపీని శనివారం జంక్షన్ పోలీస్ స్టేషన్‌లో వంశీ అందజేశారు. జంక్షన్‌తో పాటు వీరవల్లి, గన్నవరం, పటమట స్టేషన్లలోనూ అందజేసినట్టు తెలిసింది. అయితే కోర్టు నుంచి నేరుగా ఉత్తర్వు కాపీ స్టేషన్‌కు అందేవరకు హాజరు కావాలని వంశీకి జంక్షన్ పోలీస్ స్టేషన్ సిబ్బంది తెలిపారు.



క్వాంటమ్ టెక్నాలజీపై ఒప్పందం కుదుర్చుకుంటున్న ధనేకుల యాజమాన్యం

క్వాంటమ్ టెక్నాలజీ అభివృద్ధికి ఒప్పందం

పెనమలూరు, ఆగస్టు 23 (ఆంధ్రజ్యోతి): గంగూరు ధనేకుల ఇంజనీరింగ్ కళాశాలలో క్వాంటమ్ టెక్నాలజీ అభివృద్ధికి క్వినోసిస్ అవగాహన ఒప్పందం చేసుకున్నట్టు ప్రిన్సిపాల్ డాక్టర్ రవి కడియాల, డైరెక్టర్ రవిప్రసాద్ తెలిపారు. క్వినోసిస్ సీఈవో డాక్టర్ వల్లూరి మహేశ్వరరావు కళాశాల డైరెక్టర్, ప్రిన్సిపాళ్లు సదరు ఫైళ్లపై సంతకాలు చేసినట్టు తెలిపారు. ప్రిన్సిపాల్ డాక్టర్ రవి కడియాల మాట్లాడుతూ క్వాంటమ్ టెక్నాలజీ పరిశోధన, ఆవిష్కరణల్లో ఎంతో కీలకమన్నారు. దీనివల్ల విద్యార్థులు ఇన్నోవేషన్, రీసెర్చ్, స్టార్టప్‌లు, ఇండస్ట్రీ ప్రాజెక్టులు చేపట్టి నేరుగా ఉద్యోగావకాశాలను పొందవచ్చన్నారు. ఛైర్మన్ ధనేకుల రవీంద్రనాధ్ ఠాగూర్, కరస్పాండెంటు ధనేకుల భవానీ ప్రసాద్, డీన్లు సత్యప్రసాద్, గోగినేని రాజేష్ పాల్గొన్నారు.

శిశువు తల్లిదండ్రుల గుర్తింపు

- తండ్రిపై కేసు నమోదు

అజిత్‌సింగ్‌నగర్, ఆగస్టు 23 (ఆంధ్రజ్యోతి): న్యూ రాజరాజేశ్వరిపేట ప్రాంతంలోని నిర్మానుష్య ప్రదేశంలో లభ్యమైన ఆడ శిశువు తల్లిదండ్రులను అజిత్‌సింగ్‌నగర్ పోలీసులు శనివారం గుర్తించారు. శిశువును అర్ధరాత్రి వదిలివెళ్లిన తండ్రిపై కేసు నమోదు చేశారు. భార్యభర్తల తగాదాల వల్లే భర్త శిశువును వదిలేసి వెళ్లినట్టు పోలీసుల విచారణలో తేలింది. శుక్రవారం అర్ధరాత్రి న్యూ రాజరాజేశ్వరిపేట ప్రాంతంలోని పొదల్లో 3 నెలల పసికందు ఏడుపును స్థానికులు గుర్తించారు. పోలీసులకు సమాచారం ఇవ్వగా పోలీసులు వచ్చి ఆ శిశువును ఆసుపత్రికి తరలించి అక్కడ శిశువును వదిలివెళ్లింది ఎవరనే విషయమై విచారణ చేపట్టారు. ఓ మహిళ హడావుడిగా సమీపంలో తిరుగుతుండటాన్ని పోలీసులు గుర్తించారు. ఆమెను ప్రశ్నించగా తన భర్త గొడవపడి తన 3 నెలల కుమార్తె అంజమ్మను తీసుకువెళ్లిపోయాడని పోలీసులకు చెప్పింది. దీంతో పసికందు తల్లి సదరు మహిళగా నిర్ధారించుకున్న పోలీసులు ఆమెను విచారించగా, తన పేరు కానూరు పాలమ్మని, తమది వించిపేటని కాన్పు నిమిత్తం రాజరాజేశ్వరిపేటలోని పుట్టింటికి వచ్చానని చెప్పింది. అత్తిల్లు వించిపేట వెళ్లే విషయమై శుక్రవారం రాత్రి తనతో గొడవపడి 3 నెలల పసికందును తీసుకుని వెళ్లిపోయాడని పోలీసులు వద్ద వాపోయింది. దీంతో భర్త కానూరు వెంకటస్వామి (38)ని అదుపులోకి తీసుకుని పసికందును అర్ధరాత్రి నిర్మానుష్య ప్రదేశంలో వదిలేసినందుకు కేసు నమోదు చేశారు. పసికందుకు ప్రభుత్వాసుపత్రిలో చికిత్సను అందిస్తున్నారు.



షేర్‌మహ్మద్‌పేట గ్రామంలో తాగునీటి బావి వద్ద క్లోరినేషన్ చర్యలు చేపట్టిన అధికారులు

గ్రామాల్లో స్వచ్ఛాంధ్ర, స్వర్ణాంధ్ర

జగ్గయ్యపేట రూరల్, ఆగస్టు 23 (ఆంధ్రజ్యోతి): మండలంలోని షేర్‌మహ్మద్‌పేట, తక్కెళ్లపాడు, రామచంద్రునిపేట గ్రామాల్లో శనివారం ఆయా శాఖల అధికారులు స్వర్ణాంధ్ర స్వచ్ఛాంధ్ర నిర్వహించారు. శానిటేషన్, పారిశుద్ధ్యం, క్లోరినేషన్, తదితర అంశాలపై అవగాహన కలిగించటంతో పాటు గ్రామాల్లో తిరిగారు. ఆయా గ్రామాల్లో మ్యాజిక్ డ్రెయిన్ల ఏర్పాటుకు తీసుకోవాల్సిన చర్యలపై అవగాహన కలిగించారు. ఎంపీడీవో నితిన్, వైద్యాధికారి అనిల్, ఆర్‌డబ్ల్యూఎస్ డీఈఈ లింగేశ్వరరావు, ఏఈ స్వామినాయక్, పద్మావతి పాల్గొన్నారు.

ఆర్చర్ గణేశ్‌కు శాప్ ఛైర్మన్ అభినందన

విజయవాడ, స్పోర్ట్స్, ఆగస్టు 23 (ఆంధ్రజ్యోతి): కెనడాలోని విన్నిపెగ్‌లో ఈనెల 17 నుంచి 24 వరకు జరిగిన వరల్డ్ ఆర్చరీ యూత్ చాంపియన్‌షిప్‌లో అత్యుత్తమ ప్రతిభ కనబరిచి గోల్డ్‌మెడల్ సాధించిన రాష్ట్ర క్రీడాకారుడు ఆర్చర్ గణేష్ మణిరత్నానికి శాప్ ఛైర్మన్ రవినాయుడు అభినందనలు తెలిపారు. అండర్-21 కాంపౌండ్ టీమ్ విభాగంలో గోల్డ్ మెడల్స్ కైవసం చేసుకున్న భారత ఆర్చర్ల ప్రదర్శన భేష్ అని, రాష్ట్రానికి చెందిన అంతర్జాతీయ ఆర్చర్ గణేష్ మణిరత్నం గోల్డ్‌మెడల్ సాధించడం హర్షణీయమని, క్రీడలపై అతడికున్న ఆసక్తి, పట్టుదల, కఠోర శిక్షణలే విజయానికి నిదర్శనమన్నారు. భవిష్యత్తులో మరిన్ని విజయాలు సాధించి క్రీడాకారులందరికీ ఆదర్శంగా, స్ఫూర్తిగా నిలవాలని ఆకాంక్షించారు.

మొక్క  గణపయ్య..!

పర్యావరణానికి మేలు చేసే మట్టి వినాయకునికే క్రేజ్

- సారవంతమైన మట్టితో బొమ్మలు తయారీ
- ఇంటిలోనే నిమజ్జనానికి వెసులుబాటు
- బొమ్మ కరిగి నాలుగు రోజుల్లో అదేస్థానంలో మొక్కకు ప్రాణం

ఆంధ్రజ్యోతి, విజయవాడ సిటీ: కోటి విఘ్నాలు తొలగించే విఘ్నేశ్వరుడు మన ఇంటే మొక్క అయి ఉండేందుకు సిద్ధమవుతున్నాడు. శ్రద్ధాభక్తులతో మనం చేసిన పూజకు ఫలాలనందించేందుకు సమాయత్తమవుతున్నాడు. శుద్ధ చవితి నుంచి ప్రారంభమయ్యే నవరాత్రి వేడుకలకు మట్టినే రూపంగా మార్చుకుని పర్యావరణ హిత బోధన గురువై కదిలి రానున్నాడు. పండుగలు పర్యావరణ హితం కావాలి. భక్తితో చేసే పూజ ప్రకృతిని కాపాడేలా ఉండాలి. జీవకోటి మనుగడకు మరింత ఊపిరిపోయాలి. కానీ నేటి సమాజంలోకి చొచ్చుకు వచ్చిన ప్లాస్టిక్, రసాయనాలు పండుగల ఆచారాన్నే మార్చేసి, ప్రకృతిని పెనుప్రమాదంలోకి నెట్టాయి. ఎన్నో అవగాహన సదస్సుల ఫలితంగా కాస్త ఆలస్యంగానే ఈ విషయాన్ని ప్రజలు గ్రహించారు. నేడు ప్రతి ఒక్కరూ మట్టి గణపయ్యకు జై కొడుతున్నారు. హిందువులకు వినాయక చవితి అత్యంత ప్రీతిపాత్రమైంది. తొలి పూజలందుకునే ఆరాధ్యదైవంగా గణపతికి మొక్కుతారు. విఘ్నాలు తొలగించే శక్తి సామర్థ్యాలు ఒక్క విఘ్నేశ్వరుడికే ఉంటాయనేది ప్రజల ప్రగాఢ నమ్మకం. పోలాల అమావాస్య తరువాత వచ్చే శుద్ధ చవితి నుంచి తొమ్మిది రోజుల పాటు గణపతికి నవరాత్రి ఉత్సవాలు చేస్తారు.



2 లక్షలకు పైగా మట్టి గణపతులు సిద్ధం

మరో మూడు రోజుల్లో ప్రారంభమయ్యే గణేష నవరాత్రి ఉత్సవాల సందడి ఇప్పటి నుంచే ప్రారంభమైంది. విజయవాడ నగరంతో పాటు జిల్లాలోని అన్ని గ్రామాలు, పట్టణాల్లోని ప్రజలు చవితి సందడికి సిద్ధమైపోయారు. ఈ నేపథ్యంలో భక్తులకు మట్టి విగ్రహాలను సిద్ధం చేసే పనిలో తయారీదారులు నిమగ్నమయ్యారు. రెండేళ్ల నుంచి మట్టి వినాయక విగ్రహాలకు క్రేజ్ పెరుగుతోంది. ఈ ఏడాది గిరాకీ ఉంటుందనే భావనతో 3 నెలల నుంచే బొమ్మలు, విగ్రహాల తయారీలో నిమగ్నమయ్యారు. నగరంలో 300 మంది తయారు చేస్తున్నారు. నున్న, కొత్తూరు తాడేపల్లి నుంచి వారికి కేటాయించిన భూముల్లోని సారవంతమైన మట్టిన తెచ్చి బొమ్మలు తయారు చేస్తున్నారు. అలాగే కొండపల్లి, మంగళగిరి ప్రాంతాల్లో అత్యధికంగా మట్టి గణపతి విగ్రహాల తయారీ చురుగ్గా కొనసాగుతోంది. ఒక్కో కుటుంబం 2వేల నుంచి 3 వేల బొమ్మలను తయారు చేసి విక్రయానికి సిద్ధంగా ఉంచారు. మొత్తం 2 లక్షలకు పైగా బొమ్మల విక్రయాలు జరుగుతాయని ఉద్దేశంతో ఈ మట్టి విగ్రహాలను సిద్ధం చేశారు.



కుమ్మరి వీధిలో కోలాహలం

నగరంలోని గుణదల వద్ద ఏలూరు రోడ్డుకు ఆనుకుని ఉన్న కుమ్మరి వీధిలో మట్టి గణపతి బొమ్మలు, విగ్రహాలు తయారు చేస్తూ అనేక కుటుంబాలు జీవనోపాధి పొందుతున్నాయి. తమ పూర్వీకుల నుంచి వచ్చిన ఆచారాన్ని, అనుభవాన్ని, మెలుకువలను ఒడిసి పట్టి నేటితరం బొమ్మల తయారీలో నైపుణ్యాన్ని సాధించారు. మట్టిని ఇంటికి తెచ్చి బొమ్మలను తయారు చేస్తున్నారు. వీటిని ఇంటిలోనే భద్రపర్చడంతో గదులన్నీ ఇరుకుగా మారిపోయాయి. రెండు మూడ రోజుల్లో బొమ్మలన్నీ స్టాళ్లలో విక్రయిస్తామని వారు చెబుతున్నారు.



గణపయ్య కరిగి కొత్త మొక్కకు ఊపిరి

మట్టితో చేసిన ఈ బొమ్మలను ఇంటిలోనే నిమజ్జనం చేసుకునేలా తయారు చేస్తున్నారు. ఈ ఆచారాన్ని రెండేళ్లుగా నగర ప్రజలు పాటిస్తున్నారు. పూజలు పూర్తయ్యాక నిమజ్జనానికి గణపయ్యను కాలువ, చెరువు వద్దకు తీసుకెళ్లాల్సిన అవసరం లేదు. బొమ్మకు వెనుక భాగంలో ఏర్పాటు చేసిన రంధ్రంలో మనకు నచ్చిన మొక్క విత్తనాలు వేసి, బొమ్మను మొక్కలు పెంచే కుండీలో ఉంచి పై నుంచి నీళ్లు పోసి నిమజ్జనం చేస్తున్నారు. 4 రోజుల పాటు ఉదయం, సాయంత్రం వేళల్లో క్రమం తప్పకుండా నీళ్లు పోస్తే కరిగిన బొమ్మలో నుంచి మొక్క ప్రాణం పోసుకుంటుంది. కొన్నాళ్లకు పూలు, పళ్లను, ప్రాణవాయువును అందిస్తుంది.



గణపతి బొమ్మల తయారీ అంటే ఇష్టం
సంగెపు శంకర్ రవిచందర్, కుమ్మరి వీధి, గుణదల

నేను ఎంబీఏ పూర్తి చేశా. మట్టిపాత్రలు, గణపతి బొమ్మలు, ప్రమిదలు తయారు చేయడంలో మా పూర్వీకులకు మంచి నైపుణ్యం ఉంది. అదే వారి నుంచి మెళుకువలు నేర్చుకుని నేను ఇదే వృత్తిలో కొనసాగుతున్నాను. నాతో పాటు నా తల్లి సీతామహాలక్ష్మీ, తండ్రి రాఘవయ్య, భార్య షాలిని, సోదరి రత్నకుమారి 3 నెలలుగా బొమ్మల తయారీలో ఉన్నాం. నగరంలోని బొమ్మలను విక్రయిస్తాం.

మట్టి గణపతితో పర్యావరణ పరిరక్షణ: స్వాతి, సింగ్‌నగర్



గణపతి నవరాత్రులు పర్యావరణ హితం కావాలి. ప్లాస్టర్ ఆఫ్ పారిస్‌తో తయారు చేసిన బొమ్మలను ఇప్పటికైనా ఆపకపోతే భవిష్యత్తుతరాలు అనేక ఆరోగ్య సమస్యలను ఎదుర్కొనే ప్రమాదం ఉంది. ప్రతి ఒక్కరూ మట్టి గణపతికే పూజ చేయాలని కోరుతున్నా.



కాలుష్య నియంత్రణకు మట్టి గణపతి మేలు
కానుకొల్లు జ్యోతి, వస్త్ర వ్యాపారి, గుణదల

ప్లాస్టర్ ఆఫ్ పారిస్‌తో గణపతిని తయారు చేయడం, అదే బొమ్మకు రసాయనాలతో రంగులద్దడం, దీన్నే తీసుకెళ్లి నదులు, కాలువలు, చెరువుల్లో నిమజ్జనం చేస్తున్నారు. అనేక జీవజాతులు కలిసిన నీటిని తాగి అనారోగ్యం పాలవుతున్నాయి. ఇంటిలోనే మట్టి గణపతిని నిమజ్జనం చేసుకుని, తద్వారా వచ్చిన మొక్కలో గణపతిని చూసుకుంటూ మరికొన్ని నెలలు పూజలు చేసుకోవచ్చు.

గణపతి విగ్రహాల తయారీనే జీవనాధారం: ఆదిలక్ష్మీ, కుమ్మరి వీధి, గుణదల



ఎన్నో తరాలుగా మట్టి గణపతి విగ్రహాలను తయారు చేస్తున్నాం. 3 నెలల ముందు నుంచే తయారీ ప్రారంభించాం. అన్ని బొమ్మలు ఉంటాయి. రెండు మూడు రోజుల పాటు నగరంలోని విక్రయిస్తాం. పందిర్లలో ఏర్పాటు చేసే విగ్రహాలను ఆర్డర్లపై తయారు చేస్తాం.

సాధించుకున్న హక్కుల అమలుకు
పోరాటం దురదృష్టకరం

గాంధీనగర్, ఆగస్టు 23 (ఆంధ్రజ్యోతి): పోరాడి సాధించుకున్న మహిళల హక్కులను అమలు చేసేందుకు కూడా పోరాడాల్సి రావడం దురదృష్టకరమని ప్రముఖ స్త్రీవాద రచయిత్రి పీ సత్యవతి, నేతలు ఆవేదన వ్యక్తం చేశారు. స్త్రీ, పురుష సమానత్వానికి, ఆర్థిక, సామాజిక విషయాల్లో స్త్రీ స్వయం నిర్ణయాధికారం తీసుకునే హక్కు కూడా సాధించాలని ఆమె పిలుపునిచ్చారు. "79 ఏళ్ల స్వాతంత్రం-స్త్రీ సాధికారత" అనే అంశంపై ప్రగతిశీల మహిళా సంఘం (పీవోడబ్ల్యూ) రాష్ట్ర కమిటీ ఆధ్వర్యంలో స్థానిక ప్రెస్‌క్లబ్‌లో శనివారం సదస్సు జరిగింది. ఈ సందర్భంగా బాలాంతపు ప్రసూన మాట్లాడుతూ రాజ్యాధికారం, చట్టసభల్లో మహిళలకు 50శాతం రిజర్వేషన్లకు పీవోడబ్ల్యూ చేస్తున్న పోరాటానికి మద్దతు తెలిపారు. పీవోడబ్ల్యూ రాష్ట్ర అధ్యక్షురాలు ఎం లక్ష్మీ మాట్లాడుతూ పాలకులు మహిళా సాధికారత అనేది దేవతా వస్త్రాల్లా మార్చారని ధ్వజమెత్తారు. మహిళల హక్కులు ఎండమావులు అయిపోయాయని ఆవేదన వ్యక్తం చేశారు. రాష్ట్ర ప్రధానకార్యదర్శి బీ పద్మ మాట్లాడుతూ రోజురోజుకు మహిళలపై హింస హెచ్చుమీరుతుందని ఆందోళన వ్యక్తం చేశారు. పేద కుటుంబాలు మైక్రో ఫైనాన్స్ దోపిడీకి గురవుతున్నాయన్నారు. ఉపాధ్యక్షురాలు గంగాభవానీ మాట్లాడుతూ మహిళలకు ఉపాధి, రక్షణ కరువైందన్నారు. సహాయకార్యదర్శులు పీ పద్మ, వెట్టి భారతీ, ఉపాధ్యక్షులు విష్ణు, కోశాధికారి భారతీ ప్రసంగించారు.



సదస్సులో పాల్గొన్న మహిళా నేతలు

యువ మేథకు చుక్కాని ఆర్‌టీహెచ్

- జాయింట్ కలెక్టర్ ఇలక్కియా
- విజయవాడ స్పోక్ సీఈవో, ఇంక్యుబేషన్ హెడ్‌గా కృష్ణన్, రవితేజ

కలెక్టరేట్, ఆగస్టు 23 (ఆంధ్రజ్యోతి): యువ మేథస్సుకు పదును పెట్టి, ఆపై ప్రోత్సహించి పరిశ్రమల స్థాపన దిశగా చేయిపట్టి నడిపించడంలో రతన్‌టాటా ఇన్నోవేషన్ హబ్ (ఆర్‌టీఐహెచ్) కీలక పాత్ర పోషిస్తోందని, విజయవాడ స్పోక్‌ను విజయవంతంగా ముందుకు తీసుకెళ్లడంలో టీమ్ - ఆర్‌టీఐహెచ్ కొత్త ఉత్సాహంతో ముందుకెళ్లాలని జాయింట్ కలెక్టర్ ఎస్ ఇలక్కియా అన్నారు. ఎనికేపాడులోని ఆర్‌టీఐహెచ్ స్పోక్ కార్యాలయానికి సంబంధించి సీఈవోగా జీ కృష్ణన్, ఇంక్యుబేషన్ హెడ్‌గా డీ రవితేజకు జాయింట్ కలెక్టర్ ఎస్ ఇలక్కియా కలెక్టరేట్‌లో శనివారం నియామక పత్రాలు అందజేశారు. ఈ సందర్భంగా జేసీ ఇలక్కియ, సీఈవో, ఇంక్యుబేషన్ హెడ్‌లకు శుభాకాంక్షలు తెలిపారు. కొత్త ఆవిష్కరణలకు రాష్ట్రాన్ని వేదికగా తీర్చిదిద్దేందుకు అమరావతిలో రతన్‌టాటా ఇన్నోవేషన్ హబ్‌తో పాటు అనుసంధానంగా నగరంతోపాటు రాష్ట్రంలో మొత్తం 5 ప్రాంతాల్లో స్పోక్స్‌లను సీఎం ప్రారంభించారని, ఆర్‌టీఐహెచ్ స్ఫూర్తికి అనుగుణంగా అధికారులు, సిబ్బంది బృంద స్ఫూర్తితో పనిచేసి సంస్థను విజయవంతంగా ముందుకు తీసుకెళ్లాలని జేసీ ఇలక్కియా సూచించారు. ఆర్‌టీఐహెచ్ సిబ్బంది పాల్గొన్నారు.



జాయింట్ కలెక్టర్ ఇలక్కియా నుంచి నియామక పత్రాలు అందుకుంటున్న కృష్ణన్, రవితేజ

డీఎస్సీ ర్యాంకులతో అభ్యర్థుల్లో సంతోషం

- మహిళలకే ఎక్కువ ర్యాంకులు
- ఆరేళ్ల నుంచి ఎదురు చూస్తున్నాం
- కూటమి ప్రభుత్వం మాట నిలబెట్టుకుందన్న మెరిట్ అభ్యర్థులు

మచిలీపట్నం టౌన్, ఆగస్టు 23 (ఆంధ్రజ్యోతి): డీఎస్సీ మెరిట్ జాబితాలో మచిలీపట్నం నుంచి ఎక్కువ మంది మహిళలు చోటు చేసుకున్నారు. ఆరేళ్లుగా ఉద్యోగాల కోసం ఎదురు చూశామని, తమ కల నెరవేరిందంటూ మహిళా టీచర్లు ఎంతో ఆనందం వ్యక్తం చేశారు. వారి మాటల్లోనే...

సైన్స్ పాఠాలు చెప్పడమంటే ఎంతో ఇష్టం: మాధవి



సైన్స్ టీచరు కావాలని కోరిక నెరవేరుతోంది. మెరిట్ జాబితాలో నా పేరు చూసి ఎంతో సంతోషపడ్డాను. మా కుటుంబ సభ్యులందరూ ఎంతో ఆనందం వ్యక్తం చేస్తున్నారు. ఎట్టకేలకు కల నెరవేరుతోంది. గ్రంథాలయాలు, కోచింగ్ సెంటర్లకు వెళ్లి పుస్తకాలు చదివాను. చక్కగా ప్రిపేర్ అవడం వల్లే నేను టీచరనవుతున్నాను.

కష్టపడినందుకు ఫలితం దక్కింది: కే మాధవి ప్రియదర్శిని



నాలుగేళ్లుగా పుస్తకాలు పట్టుకుని చదువుతూనే ఉన్నా. గణితంలోని మెళకువలను తెలుసుకున్నా. డీఎస్సీ పరీక్ష రాసిన రోజునే అనుకున్నా. నా పేరు మెరిట్ జాబితాలో ఉంటుందని. టీచరు అవ్వాలనే కోరిక చిన్నప్పటి నుంచి ఉండేది. మా స్కూల్‌లో ఉండే టీచర్లను చూసి టీచరవ్వాలనే కోరిక ఉండేది. ఆ కోరిక నెరవేరుతోంది. టీచరు వృత్తి పవిత్రమైనది భావించా. అందుకు ఈ వృత్తినే ఎంచుకున్నా.

అన్నమాట నిలబెట్టుకున్న ప్రభుత్వం: సుంకర సునీత



ప్రభుత్వం ఎన్నికల ముందు చెప్పిన మాట నిలబెట్టుకుంది. నిరుద్యోగులకు ఉద్యోగాలు దొరుకుతున్నాయి. సామాన్య, మధ్య తరగతి కుటుంబాలకు చెందిన మహిళలు టీచర్లు కాబోతున్నాం. పాఠ్యపుస్తకాలు చదివి నేను పరీక్షలు రాశా. ఎన్నో జనరల్ నాలెడ్జ్ పుస్తకాలు చదివా. నాకు గైడ్ చేసిన సుబ్రహ్మణ్యం వంటి గణిత ఉపాధ్యాయులకు రుణపడి ఉంటా. మా కుటుంబ సభ్యుల ఆశలను నెరవేరుస్తున్నా. స్కూల్ అసిస్టెంట్‌గానే ఉద్యోగం దొరకడం ఒక గొప్ప అదృష్టంగా భావిస్తున్నా.

గుడివాడ, ఆగస్టు 23 (ఆంధ్రజ్యోతి): శుక్రవారం విడుదలైన డీఎస్సీ ఫలితాల్లో పట్టణానికి చెందిన ముగ్గురు ఉమ్మడి కృష్ణాజిల్లాలో అత్యుత్తమ ర్యాంకులను సాధించారు. స్కూల్ అసిస్టెంట్ (తెలుగు)లో బచ్చు వందనకు జిల్లా 4వ ర్యాంకు, చిల్లరిగె సాయిశ్రీ కృష్ణ తేజస్విని జిల్లా 7వ ర్యాంకు, గుంటూరు ఆనందబాబు స్కూల్ అసిస్టెంట్ (ఫిజికల్ సైన్స్)లో జిల్లా 9వ ర్యాంకులను సాధించారు.

ఎస్‌ఏ (తెలుగు)లో జిల్లా 4వ ర్యాంకు



ప్రథమ ప్రయత్నంలోనే స్కూల్ అసిస్టెంట్ (తెలుగు)లో ఉమ్మడి కృష్ణాజిల్లా 4వ ర్యాంకును సాధించడం పట్ల బచ్చు వందన హర్షం వ్యక్తం చేశారు. ప్రస్తుతం పట్టణంలోని కొత్తపేట మున్సిపల్ ప్రాథమిక పాఠశాలలో సెకండరీ గ్రేడ్ ఉపాధ్యాయురాలిగా పనిచేస్తున్నారు. 2018 డీఎస్సీలో ఎస్‌జీటీగా నియమితులయ్యారు. వందన భర్త దాశరథి మండవల్లి మండలం ప్రత్తిపాడులో మండల ప్రాథమిక పాఠశాలలో ఎస్‌జీటీగా పనిచేస్తున్నారు. పులివెందుల తెలుగు పండిట్, స్కూల్ అసిస్టెంట్ శివశంకర్ వద్ద ఆన్‌లైన్‌లో శిక్షణ పొందినట్లు వందన తెలిపారు.

ఎస్‌జీటీలో జిల్లా 7వ ర్యాంకర్ తేజస్విని



గుడివాడకు చెందిన చిల్లరిగె సాయిశ్రీ కృష్ణ తేజస్విని ఎస్‌జీటీ విభాగంలో 91.44 మార్కులతో జిల్లా 7వ ర్యాంకు సాధించారు. ఉపాధ్యాయ వృత్తి అంటే తనకు ఇష్టమని, ప్రణాళికాబద్ధంగా చదవడం, తల్లిదండ్రుల ప్రోత్సాహం, గురువుల మార్గదర్శకత్వంలో తాను ఎస్‌జీటీగా విజయం సాధించానని తేజస్విని తెలిపారు.

ఎస్‌ఏ (ఫిజికల్ సైన్స్)లో జిల్లా 9వ ర్యాంకు



చల్లపల్లికి చెందిన గుంటూరు ఆనందబాబు ఎస్‌ఏ (ఫిజికల్ సైన్స్) విభాగంలో ఉమ్మడి జిల్లాలో 9వ ర్యాంకును సాధించారు. ఆనందబాబు ప్రస్తుతం గుడివాడలో ఉంటూ నందివాడ మండలం, లక్ష్మీనరసింహపురంలోని మండల ప్రాథమిక పాఠశాలలో ఎస్‌జీటీగా విధులు నిర్వర్తిస్తున్నారు. ఈయన 2003 డీఎస్సీ ద్వారా ఎస్‌జీటీగా నియమితులయ్యారు. ప్రస్తుత డీఎస్సీలో ఫిజికల్ సైన్స్‌లో స్కూల్ అసిస్టెంట్‌గా జిల్లాలో 9వ ర్యాంకును సాధించినట్టు ఆనందబాబు తెలిపారు.

మోపిదేవి, ఆగస్టు 23 (ఆంధ్రజ్యోతి): కూటమి ప్రభుత్వం ఎన్నికల హామీల్లో ఇచ్చిన ప్రకారం మెగా డీఎస్సీ ప్రకటించటంతో ర్యాంకులు సాధించిన అభ్యర్థులు సంతోషంగా వ్యక్తం చేస్తున్నారు. మోపిదేవి మండలానికి చెందిన మోపిదేవి పంచాయతీ శివారు రావివారిపాలెం గ్రామానికి చెందిన మేకా అశ్లేష భౌతిక శాస్త్రం నందు స్కూల్ అసిస్టెంట్ విభాగంలో 75.87 మార్కులతో జిల్లాస్థాయిలో 11వ ర్యాంకు సాధించింది. గతంలో 2014, 2018లో గణితంలో డీఎస్సీ రాయగా, కొద్ది మార్కుల తేడాతో కోల్పోయింది. ప్రభుత్వం కూటమి ప్రభుత్వంలో స్కూల్ అసిస్టెంట్ భౌతిక శాస్త్రం (పీఎస్)లో 11వ ర్యాంకు సాధించటం ఎంతో సంతోషంగా ఉందన్నారు. మోపిదేవి ప్రజాశక్తినగర్‌కు చెందిన పోలిమెట్ల స్వయం ప్రభ మోపిదేవి రెవెన్యూలో వీఆర్‌ఏగా ఉద్యోగం చేస్తూ సోషల్ స్టడీస్‌లో స్కూల్ అసిస్టెంట్ విభాగం నందు డీఎస్సీ రాయగా, 76.94 మార్కులు సాధించి జిల్లాస్థాయిలో 20వ ర్యాంకు రావటంపై ఆమె ఆనందంగా వ్యక్తం చేస్తున్నారు. మెరకనపల్లి గ్రామానికి చెందిన ఎర్రంశెట్టి లెనిన్ సోషల్ స్టడీస్ స్కూల్ అసిస్టెంట్ విభాగంలో 75.8 8 మార్కులతో 28వ ర్యాంకు సాధించినట్టు తెలిపా రు. కూటమి ప్రభుత్వం ఎన్నికల్లో ఇచ్చిన హామీ ప్రకారం మెగా డీఎస్సీ ప్రకటించటం, ఉద్యోగాలు సాధించటంపై ప్రభుత్వానికి కృతజ్ఞతలు తెలిపారు.



మేకా అశ్లేష



ఎర్రంశెట్టి లెనిన్

అసిస్టెంట్ ప్రొఫెసర్‌గా పనిచేస్తూ డీఎస్సీకి

- ఎస్‌ఏ ఇంగ్లీష్‌లో జిల్లాస్థాయి 3వ ర్యాంకు



జగ్గయ్యపేట, ఆగస్టు 23 (ఆంధ్రజ్యోతి): ప్రైవేట్ ఇంజనీరింగ్ కళాశాలలో అసిస్టెంట్ ప్రొఫెసర్‌గా పనిచేస్తూ స్కూల్ అసిస్టెంట్ ఇంగ్లీష్‌లో జిల్లా స్థాయిలో మూడో ర్యాంకు సాధించారు షేర్‌మహ్మద్‌పేటకు చెందిన షేక్ ఫయాజుద్దీన్ (37). తండ్రి చిన్న వయస్సులో చనిపోవటంతో అన్నయ్య జాన్ బాషా లారీడ్రైవర్‌గా పనిచేస్తూ తనను చదవించాడని ఫయాజుద్దీన్ చెప్పారు. అన్నయ్య, అక్కలు ఇచ్చిన ప్రోత్సాహం మరవలేనిదన్నారు. ప్రభుత్వ ఉపాధ్యాయుడు కావాలనే లక్ష్యంతో కష్టపడి చదివానని, గతంలో డీఎస్సీల్లో పోస్టులు తక్కువగా ఉండటంతో ఈ సారి మెగా డీఎస్సీలో ఉద్యోగం వదలి సిద్ధమైయ్యానన్నారు. జిల్లాస్థాయి ర్యాంకు వస్తుందని భావించానని అనుకున్నట్టే జరిగిందన్నారు. తనకు భార్యా, ఇద్దరు పిల్లలు ఉన్నారని ఆయన తెలిపారు.

బ్రాయిలర్ ధరలు

అమరావతి	(రూ.లలో)
బ్రాయిలర్ బర్డ్	110, 118, 129
చికెన్ విత్ స్కిన్	210
చికెన్ స్కిన్‌లెస్	220

నెక్ కోడిగుడ్డు ధర (100)
విజయవాడ జోన్ రైతు ధర రూ. 535

రన్నింగ్ రేసులో గెలుపొందిన విద్యార్థులకు అభినందనలు

నందివాడ, ఆగస్టు 23 (ఆంధ్రజ్యోతి): హెచ్ఐవీ నివారణపై అవగాహనలో భాగంగా 5కే మారథన్ చిలకలపూడి సెంటర్ నుంచి నోబుల్ కళాశాల వరకు నిర్వహించారు. 17 నుంచి 24 సంవత్సరాల బాలురకు, బాలికలకు జిల్లాలోని వివిధ కళాశాల నుంచి 75 మంది పాల్గొన్నారు. విజేతలనుప్రిన్సిపల్ పి.బి.సాల్మాన్ రాజు, కళాశాల సిబ్బంది అభినందించారు. అనంతరం రాష్ట్ర స్థాయిలో జరిగే పోటీలకు జిల్లా తరపున కళాశాల విద్యార్థులు పాల్గొంటారని తెలిపారు.


టంగుటూరి చిత్రపటానికి నివాళ్ళులర్పిస్తున్న మున్సిపల్ కమిషనర్ మనోహర్

'టంగుటూరి'కి ఘన నివాళి

గుడివాడ, అగస్టు 23(ఆంధ్రజ్యోతి) : టంగుటూరి ప్రకాశం పంతులు జయంతి సందర్భంగా శనివారం మున్సిపల్ కార్యాలయంలో ఆయన చిత్రపటానికి పూల మాలలు వేసి నివాళ్ళులర్పించారు. కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ సింహాద్రి మనోహర్, మేనేజర్ నిర్మలకుమారి, సిబ్బంది పాల్గొన్నారు.

గుడివాడ రూరల్, ఆగస్టు 23 (ఆంధ్రజ్యోతి): చౌటపల్లి శాఖా గ్రంథాలయంలో టంగుటూరు ప్రకాశం పంతులు జయంతిని ఘనంగా నిర్వహించారు. గ్రంథాలయ అధికారి జి.రత్నచంద్ ఆధ్వర్యంలో ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. అట్లూరి నాగేంద్ర ప్రసాద్, విద్యార్థులు పాల్గొన్నారు.

ఆధ్యాత్మిక వైభవాన్నీ పెంపొందిస్తా : ఎమ్మెల్యే వెనిగండ్ల

గుడివాడ, అగస్టు 23(ఆంధ్రజ్యోతి) : గుడివాడను మరింత ఆధ్యాత్మిక వైభవం పెంపొందించేలా కృషి చేస్తానని గణపతి నవరాత్రులు వైభవంగా జరుపుతున్నామని ఎమ్మెల్యే వెనిగండ్ల రాము అన్నారు. రాజేంద్రనగర్‌లోని ఎమ్మెల్యే స్వగృహంలో శనివారం శ్రీవిఘ్నేశ్వరస్వామి దేవస్థానంలో జరిగే నవరాత్ర మహోత్సవాల ఆహ్వాన పత్రికను ఎమ్మెల్యే ఆవిష్కరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ నియోజకవర్గంలో ఉత్సవ పందిళ్లకు సింగిల్ విండో అనుమతులు ప్రభుత్వం ఇస్తుందన్నారు. అవాంతరాలు తలెత్తకుండా పోలీసు శాఖ ముందస్తు చర్యలు తీసుకుందన్నారు. కార్యక్రమంలో దేవస్థాన కమిటీ ఛైర్మన్ సాయన రాజేష్, ఈవో యార్లగడ్డ శ్రీనివాసరావు(వాసు), కమిటీ సభ్యులు లోయ వాసు, పంచుమర్తి శ్రీనివాసరావు, రమణమూర్తి, పోతురాజు, వీరమాచినేని శైలజ, విజయలక్ష్మి, శారద, దుర్గభవాని, గణపతిశాస్త్రి పాల్గొన్నారు.

'సురవరం'కు సీపీఐ నేతల నివాళి

కూచిపూడి, ఆగస్టు 23 (ఆంధ్రజ్యోతి): సీపీఐ జాతీయ మాజీ ప్రధాన కార్యదర్శి, మాజీ ఎంపీ సురవరం సుధాకర్‌రెడ్డి మృతి పట్ల కూచిపూడిలోని పార్టీ కార్యాలయంలో ఆ పార్టీ నేతలు ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. సీపీఐ గొప్ప ఉద్యమ యోధుడిని కోల్పోయిందని, ఆయన మృతి పార్టీకి తీరని లోటని నేతలు పేర్కొన్నారు. పార్టీ నేతలు చెరకు శ్రీనివాసరావు,ర కె.వి.అప్పారావు, బోరుకాటి నరసింహరాజు, కొండా నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

స్వర్ణాంధ్ర- స్వచ్ఛాంధ్ర సాధన లక్ష్యం

- ఎమ్మెల్యే వెనిగండ్ల రాము
- పరిసరాల పరిశుభ్రతపై అవగాహన పెంచుకోవాలి
- పలుచోట్ల ప్రతిజ్ఞ

పమిడిముక్కల, ఆగస్టు 23 (ఆంధ్రజ్యోతి) : పరిసరాల పరిశుభ్రత పాటించి స్వచ్ఛాంధ్ర సాధనలో భాగస్వాములమవుదామని ఎమ్మెల్యే వర్ల కుమార్‌రాజా అన్నారు. కపిలేశ్వరపురం ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఆధ్వర్యంలో శనివారం నిర్వహించిన స్వర్ణాంధ్ర-స్వచ్ఛాంధ్ర కార్యక్రమంలో పాల్గొని మొక్కలునాటి, పరిసరాల పరిశుభ్రత అవగాహన ర్యాలీలో పాల్గొన్నారు. నాయకులు తాతినేని రమేశ్, సాయిదత్, కొల్లిపర బాబి, మాజీవైస్ ఎంపీపీ లింగమనేని బాబూరావు, వైద్యసిబ్బంది పాల్గొన్నారు.

పామర్రు : పరిసరాల పరిశుభ్రతపై అవగాహనతో ప్రజలు ముందుకు సాగాలని ఎంపీడీవో కె.జ్యోతి అన్నారు. శనివారం పంచాయతీ ఆవరణలో సర్పంచ్ కేతావత్ కస్తూరి అధ్యక్షతన స్వచ్ఛాంధ్ర- స్వర్ణాంధ్ర గ్రామ సభ నిర్వహించారు. అనంతరం పురవీధుల్లో ర్యాలీ నిర్వహించి ప్రజలకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో డిప్యూటీ ఎంపీడీవో గుత్తికొండ కిషోర్ కార్యదర్శి అబ్దుల్ సలీం పాల్గొన్నారు.

కూచిపూడి : కూచిపూడి ఏఎంసీ కార్యాలయంతోపాటు మొవ్వ వివిఎస్ఆర్ ప్రభుత్వ డిగ్రీ, పీజీ కళాశాలల్లో స్వర్ణాంధ్ర - స్వచ్ఛాంధ్ర కార్యక్రమాలు నిర్వహించారు. ఈ సందర్భంగా పరిసరాలు పరిశుభ్రం చేయటంతోపాటు ప్రతిజ్ఞ చేశారు. కూచిపూడి ఏఎంసీ కార్యాలయంలో పారిశుధ్య కార్మికురాలు బాలమ్మను సత్కరించారు. ఏఎంసీ ఛైర్మన్ దోనేపూడి శివరామయ్య, ప్రత్యేక శ్రేణి కార్యదర్శి ఎస్.అక్బర్ బాషా, ఉద్యోగులు, సిబ్బంది పాల్గొన్నారు.

గుడివాడ రూరల్ : ప్రభుత్వం స్వచ్ఛాంధ్ర - స్వర్ణాంధ్ర కార్యక్రమాన్ని ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తుందని ఎంపీడీవో విష్ణుప్రసాద్ అన్నారు. శనివారం మల్లాయిపాలెంలో ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమ విశిష్టతను తెలియజేస్తూ నినాదాలతో ర్యాలీ నిర్వహించారు. మల్లాయిపాలెంలో వీధులను పరిశుభ్రపర్చటంతోపాటు గృహాల్లో తీసుకోవాల్సిన జాగ్రత్తలు తదితర విషయాలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో కార్యదర్శి కోటయ్య, కూటమి నాయకులు, పంచాయతీ సిబ్బంది పాల్గొన్నారు.



కపిలేశ్వరపురంలో స్వర్ణాంధ్ర - స్వచ్ఛాంధ్ర కార్యక్రమం ర్యాలీలో పాల్గొన్న ఎమ్మెల్యే వర్ల కుమార్‌రాజా



పామర్రులో స్వచ్ఛతాహి సేవా ర్యాలీ కార్యక్రమంలో పాల్గొన్న అధికార, ప్రజాప్రతినిధులు



మల్లాయిపాలెంలో ర్యాలీ

ప్రభుత్వ పథకాలను సద్వినియోగం చేసుకోండి : ఎంపీడీవో


అవగాహన సదస్సులో మాట్లాడుతున్న ఎంపీడీవో జ్యోతి

పామర్రు,ఆగస్టు23 (ఆంధ్రజ్యోతి): గ్రామీణ ప్రాంతాల్లో మహిళల ఆర్థిక సాధికారత కోసం ప్రభుత్వాలు అమలు చేస్తున్న పథకాలను సద్వినియోగం చేసుకుని సమాజంలో చిన్న, మధ్యతరహా పారిశ్రామిక వేత్తలుగా నిలవాలని ఎంపీడీవో కాండ్రు జ్యోతి అన్నారు. వెలుగు కార్యాలయంలో శనివారం ఏపీఎంఎస్ఎంఈ పథకం ద్వారా మహిళలను బిజినెస్ ప్రొవైడర్ల ఎంపిక నిర్వహణపై జరిగిన అవగహాన సదస్సులో పాల్గొని మాట్లాడుతూ ప్రభుత్వం మహి టళలకు రాయితీపై అందిస్తున్నా పథకాలను వివరించారు. కార్యక్రమంలో ఛైర్‌పర్సన్ కె.కనకదుర్గా, వెలుగు ఏపీఎం తిరుపతిరావు, స్వయం సహాయక గ్రూప్ లీడర్లు పాల్గొన్నారు


నేత్ర పరీక్షలు చేస్తున్న వైద్యులు

123 మందికి వైద్యసేవలు

పమిడిముక్కల, అగస్టు 23 (ఆంధ్రజ్యోతి) : ఉయ్యూరు రోటరీ క్లబ్, రోటరీ నేత్ర వైద్యశాల ఆధ్వర్యంలో శనివారం హనుమంతపురంలో ఉచిత వైద్యశిబిరం నిర్వహించి 129 మందికి వైద్య, నేత్రపరీక్షలు చేసి మందులు అందజేశారు. క్లబ్ అధ్యక్షుడు చొప్పరపు నాగ సుబ్రమణ్యం మాట్లాడుతూ 6 మందికి కంటికి సంబంధించి శస్త్రచికిత్స అవసరమని వైద్యులు నిర్ధారించగా వారికి రోటరీ నేత్రవైద్య శాలలో ఉచితంగా చేయిస్తామన్నారు. మాజీ వైస్ ఎంపీపీ లింగమనేని బాబూరావు, రోటరీ ట్రస్టు వైద్యులు జగన్నాథరాజు, సరిత, వరలక్ష్మి, రోటరీ క్లబ్ సెక్రటరీ అమీర్ మీర్జా సేవలందించారు.

పశువుల దాణా పంపిణీ

గుడివాడ రూరల్, ఆగస్టు 23 (ఆంధ్రజ్యోతి): బొమ్ములూరులో మండల టీడీపీ అధ్యక్షుడు వాసే మురళీ, పీఏసీఎస్ ఛైర్మన్ గుత్తా సుబ్రహ్మణ్యేశ్వరరావు ఆధ్వర్యంలో శనివారం పశువుల దాణా పంపిణీ చేశారు.ఎస్సీ పాడి రైతులకు పశువుల దాణాను పంపిణీ చేశారు. 50 శాతం సబ్సిడీపై అందించారు. ప్రతీ రైతు పాడి పశువులను పెంచుకుని అత్యధిక లాభాలుగా గడించాలని కోరారు.


విరాళం అందజేస్తున్న దాత పువ్వాడ

రాజగోపుర నిర్మాణానికి
రూ.50 వేలు విరాళం

గుడివాడ, అగస్టు 23(ఆంధ్రజ్యోతి) : గంగాపార్వతీ సమేత భీమేశ్వరస్వామి దేవస్థానంలో జరుగుతున్న ఐదు అంతస్థుల రాజగోపుర నిర్మాణం నిమిత్తం స్థానికులు పువ్వాడ వెంకటలక్ష్మనకుమార్, వెంకట సునీత దంపతులు రూ.50వేలు విరాళంగా శనివారం ఈవో కందుల వేణు గోపాలరావుకు అందజేశారు. కార్యక్రమంలో తూంపూడి సాంబశివరావు పాల్గొన్నారు.

నోటు పుస్తకాల పంపిణీ

పమిడిముక్కల, ఆగస్టు 23 (ఆంధ్రజ్యోతి) : స్వచ్ఛంద సంస్థలు, చారిటబుల్ ట్రస్టుల సేవలు ఎనలేనివని ఎమ్మెల్యే వర్లకుమార్ రాజా అన్నారు. కపిలేశ్వరపురం జిల్లాపరిషత్ ఉన్నత పాఠశాలలో 300 మంది విద్యార్థులకు శనివారం రూ. 75 వేలు విలువచేసే 1500 నోటు పుస్తకాలు పవర్ మెక్ ఫౌండేషన్ ఛైర్మన్ సజ్జా కిషోర్‌బాబు, లక్ష్మీ దంపతుల ఆధ్వర్యంలో పంపిణీచేశారు. కార్యక్రమంలో తాతినేని రమేష్, తాతినేని సాయిదత్, కొల్లిపర బాబి, పాల్గొన్నారు.

ఆర్థిక సాయం

పామర్రు : పేదలను ఆదుకునేందుకు దాతలు ముందుకు వచ్చి మార్గదర్శకులుగా నిలవాలని ఎమ్మెల్యే వర్ల కుమార్‌రాజా కోరారు. పెదపారుపూడికి చెందిన ఓ లారీ డ్రైవర్ రాష్ట్రంలో గుండెపోటుతో మరణించడంతో టీడీపీ నేత చప్పిడి కిషోర్ రూ.50వేలు ఆర్థిక సాయం అందించారు. చెక్కును శనివారం ఎమ్మెల్యే బాధిత కుటుంబానికి అందజేశారు.

ఆర్‌పీలపై చిన్నచూపు తగదు

గుడివాడ, అగస్టు 23 (ఆంధ్రజ్యోతి) : ఆర్‌పీల పట్ల ప్రభుత్వాలు చిన్నచూపు చూడటం దారుణమని మెప్మా ఆర్‌పీ ఉద్యోగుల సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కె.ధనలక్ష్మి అన్నారు. సుందరయ్యభవన్‌లో శనివారం జరిగిన రాష్ట్ర మెప్మా ఆర్‌పీ ఉద్యోగుల సంఘం ప్రథమ మహాసభ ఆర్.పీలు ఎం.దీవెన, జె.ఝాన్సీల అధ్యక్షతన నిర్వహించారు. ఈ మహాసభకు ఆమె ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ వేతనాలు కూడా సకాలంలో ప్రభుత్వం చెల్లించడం లేదన్నారు. న్యాయమైన సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేశారు. వేతనాలను పెంచాలని, హెచ్ఆర్ పాలసీ అమలు చేయాలని, పనిభారాన్ని తగ్గించాలని, ఆన్‌లైన్ యాప్‌లపై ఇవ్వాలని మహాసభలో చేసిన తీర్మానాలను ఆమోదించారు. ఈ సందర్భంగా నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. అధ్యక్షురాలిగా ఎం.దీవెన, ప్రధాన కార్యదర్శి జె.ఝాన్సీ సహాయ కార్యదర్శి పి.జ్యోతి, ఉపాధ్యక్షురాలు లక్ష్మీకుమారిలతో పాటు 15 మందితో జిల్లా కమిటీని ఎన్నుకున్నారు. పి.ధనశ్రీ, ఎ.రమాదేవి, కె.వెంకటేశ్వరరావు, మచిలీపట్నం, గుడివాడ, పెడన, ఉయ్యూరు. తాడిగడప మున్సిపాలిటీల్లో పనిచేసే ఆర్‌పీలు పాల్గొన్నారు.


ప్రసంగిసున్న రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ధనలక్ష్మీ

తల్లిదండ్రుల పట్ల నిర్లక్ష్యం వద్దు

గుడివాడ, అగస్టు 23(ఆంధ్రజ్యోతి) : జన్మనిచ్చిన తల్లిదండ్రుల పట్ల నిర్లక్ష్యం వహించవద్దని టూటౌన్ బీజేపీ అధ్యక్షుడు మాచర్ల రామకృష్ణ అన్నారు. పెద్దకాల్వ సెంటర్‌లో రెండురోజులుగా ఉన్న వృద్ధురాలిని శనివారం బేతవోలులోని శాంతి వృద్ధాశ్రమంలో చేర్పించారు. లంకా రాంబాబు, గాదె చరణ్, తదితరులు పాల్గొన్నారు.

డ్రైనేజీల్లో దోమల నివారణ మందు పిచికారీ

గుడ్లవల్లేరు, ఆగస్టు 23 (ఆంధ్రజ్యోతి) : స్వచ్ఛాంధ్ర-స్వర్ణాంధ్ర కార్యక్రమంలో భాగంగా శనివారం గుడ్లవల్లేరు పంచాయతీలో జరుగుతున్న తడి, పొడి చెత్త సేకరణలను శనివారం ఎంపీడీవో ఇమ్రాన్ పరిశీలించారు. అనంతరం రక్షితనీటి సరఫరా, క్లోరినేషన్‌లను తనిఖీ చేశారు. అనంతరం గ్రామంలో దోమల నివారణ కోసం చేస్తున్న చర్యలను పరిశీలించారు. ఈ సందర్భంగా పంచాయతీ నుంచి స్వచ్ఛాంధ్ర స్వర్ణాంధ్ర ర్యాలీలో పారిశుధ్య కార్మికులు, గ్రీన్ అంబాసిడర్లతో పాల్గొన్నారు. కార్యదర్శి నరసింహారావు, సచివాలయం కార్యదర్శి నాగ కామాక్షి తదితరులు పాల్గొన్నారు.

ఆటో కార్మికులను ప్రభుత్వం ఆదుకోవాలి : సీఐటీయూ


తహసీల్దార్ కార్యాలయం వద్ద ఆందోళన చేస్తున్న ఆటో కార్మికులు

పామర్రు,ఆగస్టు 23 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం స్త్రీశక్తి పథకం అమలుతో ఆటో కార్మికుల ఉపాధి దెబ్బతిన్నదని, వారిని ఆదుకోవాలని సీఐటీయూ నేతలు డిమాండ్ చేశారు. పామర్రు నాలుగు రోడ్ల కూడలిలో శనివారం ఆటోడ్రైవర్లతో కలిసి ఆందోళన నిర్వహించారు. జిల్లాఆటో వర్కర్స్ యూనియన్ ప్రధాన కార్యదర్శి ఎం.పోల్‌నాయుడు సంఘీభావం తెలిపారు. స్త్రీశక్తి పథకంతో ఆటోలకు కిరాయిలు లేక వాటిని నెలసరి వాయిదాలు కట్టే మార్గం లేక సతమతున్నారన్నారు. ఆటో కార్మికులకు గత ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీని చంద్రబాబు నిలబెట్టుకోవాలని డిమాండ్ చేశారు. లేని పక్షంలో ఆటో కార్మికులకు అండగా నిలిచి ప్రభుత్వంపై పోరాటం చేస్తామన్నారు. కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు ఒడుగు గంగాధర ప్రసాద్, సీపీఎం నేత బరిగెల భీమేశ్వరరావు, పామర్రు ఆటో వర్కర్స్ అధ్యక్షుడు కె.ప్రసాద్, కె.దిలీప్ తదితర్లు పాల్గొన్నారు.

జ్ఞానం, నైపుణ్యంతో విద్యార్థులను సన్నద్ధం చేయాలి

గుడివాడ, అగస్టు 23 (ఆంధ్రజ్యోతి) : కేవలం పుస్తక పరిజ్ఞానానికి పరిమితం కాకుండా జ్ఞానం, నైపుణ్యాల కలయికతో విద్యార్థులను సన్నద్ధం చేయాలని మోటివేషనల్ స్పీకర్, సైకాలజిస్ట్ పి.విజయలక్ష్మి అన్నారు. అక్కినేని నాగేశ్వరరావు కాలేజ్ ఆఫ్ ఇంజినీరింగ్ అండ్ టెక్నాలజీ కళాశాలలో శనివారం ఆధునిక కాలంలో స్వీయ-అనుకూలత, వ్యక్తిగత అభివృద్ధి-సంరక్షణ, మానసిక ఆరోగ్యంపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ సొంత భావోద్వేగాలను అర్థం చేసుకోవడం, ఇతరులను పట్ల సానుభూతి చూపడం సమర్థవంతమైన టీం వర్క్ అవసరమని సూచించారు. విద్యార్థుల్లో స్వీయ సామర్థ్యాన్ని పెంచే 'ప్లాటినం అవర్'గా ఉదయం వేళలు పరిగణించ బడతాయని, చదువుల్లో సమయపాలన, సానుకూల దృక్పథం ఉన్న వ్యక్తులతో స్నేహంగా ఉండాలన్నారు. సదస్సులో కళాశాల అధ్యక్ష, కార్యదర్శులు ఎల్.ఆర్.కె.ప్రసాద్, కె.ఎస్ అప్పారావు, ప్రిన్సిపాల్ ఎ.రామారావు పాల్గొన్నారు.

సర్పంచ్ తల్లి భారతికి మంత్రి పార్థసారథి నివాళి

కూచిపూడి, ఆగస్టు 23 (ఆంధ్రజ్యోతి): మొవ్వ మండలం అయ్యంకి సర్పంచ్ నాగనబోయిన సునీల్ తల్లి భారతి (62)కి మంత్రి కొలుసు పార్థసారథి నివాళులర్పించారు. కారకంపాడులోని భారతి భౌతిక కాయంపై పూలదండ వేసి కుటుంబసభ్యులను ఓదార్చారు. ఎమ్మెల్యే వర్ల కుమార్ రాజా, మాజీ ఎమ్మెల్యే కైలే అనిల్ కుమార్, వివిధ పార్టీలకు చెందిన నేతలు లింగమనేని రామలింగేశ్వరరావు, రాజులపాటి పార్వతీ, రాజులపాటి రాఘవరావు, చిందా నాగేశ్వరరాజు, నివాళులర్పించారు.


భారతి పార్థీవదేహానికి నివాళులర్పిస్తున్న మంత్రి కొలుసు పార్థసారథి

ఆర్‌అండ్‌బీ రోడ్డు మరమ్మతుల పరిశీలన

పెదపారుపూడి, ఆగస్టు 23 (ఆంధ్రజ్యోతి): పెదపారుపూడి - వెంట్రప్రగడ ఆర్ అండ్‌బీ రోడ్డుకు చేపట్టిన మరమ్మతులను ఎమ్మెల్యే వర్ల కుమార్ రాజా పరిశీలించారు. ఈ సందర్భంగా డీఈ, సిబ్బందితో మాట్లాడుతూ నాణ్యతా ప్రమాణాలతో రోడ్డు నిర్మించాలని సూచించారు.

మొక్కలను నాటిన రోటరీ క్లబ్ గుడివాడ సభ్యులు

గుడివాడ, అగస్టు 23(ఆంధ్రజ్యోతి) : గుడివాడ-పామర్రు హైవే పక్కన రోటరీ క్లబ్ ఆఫ్ గుడివాడ ఆధ్వర్యంలో శనివారం 40మొక్కలను నాటారు. కార్యక్రమంలో క్లబ్ అధ్యక్షక, కార్యదర్శులు వై.నాగేశ్వరరావు, జి.కిరణ్‌బాబు, పూర్వ అధ్యక్షుడు ఎ.సుబ్రహ్మణ్యేశ్వరరావు, బి.శంకరరావు, జె.ఉమామహేశ్వరరావు, వై.సుహాస్ పాల్గొన్నారు.

ఇరిగేషన్ కృష్ణా ఈస్ట్రన్ కార్యాలయ తరలింపుపై ఎమ్మెల్యే లేఖ

గుడివాడ, అగస్టు 23(ఆంధ్రజ్యోతి) : ఇరిగేషన్ కృష్ణా ఈస్ట్రన్ కార్యాలయాన్ని విజయవాడ నుంచి గుడివాడకు తరలించాలని దీర్ఘకాలంగా రైతులు పోరాటం చేస్తున్నారని ఎమ్మెల్యే వెనిగండ్ల రాము అన్నారు. దానికోసం ఈ నెల 5న జలవనరుల శాఖ మంత్రి నిమ్మల రామానాయుడుకు లేఖ రాశారు.

బ్రాయిలర్ ధరలు



అమరావతి	(రూ.లలో)
బ్రాయిలర్ బర్డ్	110, 118, 129
చికెన్ విత్ స్కిన్	210
చికెన్ స్కిన్‌లెస్	220

నెక్ కోడిగుడ్డు ధర (100)

విజయవాడ జోన్ రైతు ధర రూ. 535

పాత ఎడ్లంకలో కొనసాగుతున్న దీక్ష

అవనిగడ్డ రూరల్, ఆగస్టు 23(ఆంధ్రజ్యోతి): కృష్ణానది కోత నుంచి పాత ఎడ్లంకను పరిరక్షించాలని గ్రామస్థులు చేస్తున్న దీక్ష శనివారం రెండో రోజుకు చేరింది. శిబిరాన్ని మాజీ ఎమ్మెల్యే సింహాద్రి రమేష్‌బాబు, మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ కడవకొల్లు నరసింహారావు వేర్వేరుగా సందర్శించి, గ్రామస్థులతో మాట్లాడారు. వరదలు సంభవించిన ప్రతీసారి గ్రామం నది కోతకు గురవుతోందని సింహాద్రి రమేష్‌బాబు ఆందోళన వ్యక్తం చేశా రు. వరద నివారణకు పటిష్ఠమైన చర్యలు తీసుకోవాల్సిన బాధ్యత పాలకులపై ఉందని, అయినా స్పందన లేకపోవటం బాధాకరమన్నారు. గత ప్రభుత్వ హయాంలో రూ.8.50 కోట్లతో అంచనాలు రూపొందించి ప్రభుత్వానికి పంపామని, ప్రభుత్వం మారడంతో అవి బుట్టదాఖలయ్యాయని ఆయన ఆవేదన వ్యక్తంచేశారు.



అవనిగడ్డలో మంత్రి నారా లోకేశ్ చిత్రపటానికి పాలాభిషేకం చేస్తున్న ఎమ్మెల్యే మండలి బుద్ధప్రసాద్, టీడీపీ నేత కనపర్తి శ్రీనివాసరావు

ఉపాధ్యాయ పోస్టులు
భర్తీ చేసిన ఘనత మంత్రి లోకేశ్‌దే

అవనిగడ్డ, ఆగస్టు 23(ఆంధ్రజ్యోతి): యువగళం పాదయాత్రలో ఇచ్చిన మాట ప్రకారం కూటమి ప్రభుత్వం ఏర్పడిన మొదటి ఏడాదిలోనే 16 వేల ఉపాధ్యాయ పోస్టులు భర్తీ చేసిన ఘనత విద్యాశాఖ మంత్రి నారా లోకేశ్‌కు దక్కుతుందని ఎమ్మెల్యే మండలి బుద్ధప్రసాద్, టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి కనపర్తి శ్రీనివాసరావు అన్నారు. ఉపాధ్యాయ పోస్టులు భర్తీ చేసినందుకు హర్షం వ్యక్తం చేస్తూ అవనిగడ్డలో శనివారం కూటమి పార్టీల నేతృత్వంలో భారీ ర్యాలీ నిర్వహించారు. రాష్ట్రంలోని వివిధ ప్రాంతాల నుంచి అవనిగడ్డ వచ్చి ఉపాధ్యాయ పోస్టుల కోసం శిక్షణ పొందిన వేలాది మంది కలలను కూటమి ప్రభుత్వం నెరవేర్చిందని ఎమ్మెల్యే బుద్ధప్రసాద్, కనపర్తి శ్రీనివాసరావు అన్నారు. దివి మార్కెట్ కమిటీ చైర్మన్ కొల్లూరి వెంకటేశ్వరరావు, పీసీ చైర్మన్ దేవనబోయిన వెంకటేశ్వరరావు, నడకుదుటి జనార్దనరావు, తుమ్మల చౌదరిబాబు, మెండు లక్ష్మణరావు, బండే శ్రీనివాసరావు, మోర్ల రాంబాబు, మాచవరపు ఆదినారాయణ, రావి నాగేశ్వరరావు, బండి కనకదుర్గ, కర్రా సుధాకర్, పైడిపాముల కృష్ణకుమారి, మర్రె గంగయ్య, బొప్పన భాను, బచ్చు రఘునాథ్ ప్రసాద్, గుడివాక శివరావు పాల్గొన్నారు.

క్రీడా దినోత్సవాన్ని విజయవంతం చేయండి

అవనిగడ్డ, ఆగస్టు 23(ఆంధ్రజ్యోతి): జాతీయ క్రీడా దినోత్సవాన్ని జయప్రదం చేయాలని వ్యాయామ ఉపాధ్యాయులకు ఎమ్మెల్యే మండలి బుద్ధప్రసాద్ సూచించారు. శనివారం తన కార్యాలయంలో అవనిగడ్డ సబ్ జోన్ గేమ్స్ అండ్ స్పోర్ట్స్ పోటీల కరపత్రాలను ఆయన ఆవిష్కరించారు. ఈనెల 25, 26 తేదీల్లో కోడూరు మండలం వి.కొత్తపాలెం జడ్పీ పాఠశాలలో ఆటల పోటీలు జరుగుతాయని, 29వ తేదీన అవనిగడ్డ ప్రభుత్వ క్రీడా మైదానంలో క్రీడా దినోత్సవ వేడుకలు నిర్వహిస్తామని ఎమ్మెల్యేకు వ్యాయామోపాధ్యాయులు వివరించారు. వెంకటేశ్వరరావు, బీపీఎల్ ప్రసాద్, నవీన్, సీహెచ్ సుబ్బారావు, ఎం.శ్యామ్‌కుమార్, ఎ.శ్రీహరి, ఏటీ తాతాజీ, గరికపాటి మారుతి పాల్గొన్నారు.

విద్యార్థినికి గాయం.. ఘటనపై విచారణ

పెడన, ఆగస్టు 23(ఆంధ్రజ్యోతి): దక్షిణ తెలుగుపాలెం ప్రాథమిక పాఠశాలలో ఉపాధ్యాయురాలు గాయత్రి చేతిలోని బెత్తం తగిలి 2వ తరగతి విద్యార్థిని తోష్మిత స్వల్పంగా గాయపడిన ఘటనపై డీఈవో ఆదేశాల మేరకు ఎంఈవో-2 వై.వి.హరనాథ్ శనివారం విచారణ జరిపారు. తోష్మిత గడ్డం వద్ద ఉన్న గాయాన్ని పరిశీలించి, ఎలా అయిందని అడిగి, ఆమె నుంచి వివరాలు సేకరించారు. అనంతరం ఉపాధ్యాయురాలిని విచారించారు. తాను తోష్మితపై బెత్తం విసరలేదని ఎంఈవో-2కు ఉపాధ్యాయురాలు స్పష్టం చేశారు. విద్యార్థులను విడిచిపెట్టిన సమయంలో అందరూ ఒకేసారి బయటకు వెళుతుంటే వారిని వరుస క్రమంలో పంపేందుకు ప్రయత్నించానన్నారు. ఆ సమయంలో పొరబాటున తన చేతిలోని బెత్తం తోష్మిత గడ్డం దగ్గర గుచ్చుకుని చిన్న గాయమైందన్నారు. గాయత్రి నుంచి ఎంఈవో 2 లిఖిత పూర్వకంగా స్టేట్‌మెంట్ తీసుకున్నారు. అనంతరం హెచ్‌ఎం పద్మావతిని విచారించి, స్టేట్‌మెంట్ తీసుకున్నారు. వాటిని డీఈవోకు పంపారు. చైల్డ్ వెల్ఫేర్ సొసైటీ ప్రతినిధులు శనివారం పాఠశాలకు వెళ్లి జరిగిన ఘటనపై విచారణ జరిపారు. దక్షిణ తెలుగుపాలెం పెద్దలు సిరివెళ్ల జయేష్, పరసా సూర్యనారాయణ, సిరివెళ్ల రామకృష్ణ, నాగేంద్రం తదితరులు శనివారం పాఠశాలకు వెళ్లి జరిగిన ఘటనపై ఆరా తీశారు. ఉపాధ్యాయులు, తోష్మిత తల్లిదండ్రులతో మాట్లాడి ఇరువర్గాల మధ్య రాజీ కుదిర్చారు.

చవితి వేడుకలు ప్రశాంతంగా నిర్వహించుకోవాలి



గణేష్ మందిరాల నిర్వాహకులతో మాట్లాడుతున్న డీఎస్పీ విద్యశ్రీ

అవనిగడ్డ, ఆగస్టు 23 (ఆంధ్రజ్యోతి): వినాయక చవితి వేడుకలను ప్రశాంతంగా నిర్వహించుకోవాలని గణేష్ మండపాల నిర్వాహకులకు డీఎస్పీ తాళ్లూరి విద్యశ్రీ సూచించారు. శనివారం అవనిగడ్డ పోలీస్‌స్టేషన్‌లో సబ్‌డివిజన్ పరిధిలోని మండపాల నిర్వాహకులు, డీజే బాక్సుల యజమానులు, లౌడ్ స్పీకర్లు పెట్టేవారు, ఫ్లెక్సీ షాపుల యజమానులతో ఆమె ప్రత్యేక సమావేశం నిర్వహించారు. చవితి వేడుకల సందర్భంగా కులాలు, మతాల మధ్య అంతరాలు సృష్టించేలా పాటలు పెట్టినా, డీజేల్లో పాటలు వేసినా నిర్వాహకులతోపాటు అందుకు ఉపకరించిన డీజేలు, స్పీకర్లు స్వాధీనం చేసుకుంటామని హెచ్చరించారు. నవరాత్రి వేడుకల్లో ఆధ్యాత్మిక భావనలు పెంపొందించేందుకు ప్రాధాన్యతమివ్వాలని డీఎస్పీ సూచించారు. సీఐ యువకుమార్, ఎస్‌ఐలు శ్రీనివాస్, రాజేష్ పాల్గొన్నారు.

డీజేలకు అనుమతి లేదు

గూడూరు: గణేష్ నవరాత్రి ఉత్సవాల్లో డీజేలకు అనుమతి లేదని ఎస్సై కె.ఎస్.వి.సత్యనారాయణ తెలిపారు. వార్డుల్లో విగ్రహాలు పెట్టి ఉత్సవాలు నిర్వహించేవారు ముందుగా కమిటీని ఏర్పాటు చేసుకుని పోలీసు స్టేషన్‌లో తెలియజేయాలని ఆయన సూచించారు. శనివారం పోలీసు స్టేషన్‌లో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. పోలీసు స్టేషన్ ద్వారా డీఎస్పీ వద్ద అనుమతి తీసుకుని మైకులు, సౌండ్ బాక్సులు పెట్టుకోవాలన్నారు.

అవాంఛనీయ ఘటనలు జరగకుండా జాగ్రత్తలు తీసుకోండి

పెడన: వినాయక చవితి ఉత్సవాల్లో అవాంఛనీయ ఘటనలు జరగకుండా నిర్వాహక కమిటీ సభ్యులు జాగ్రత్తలు తీసుకోవాలని సీఐ కె.నాగేంద్రప్రసాద్ సూచించారు. శనివారం పోలీసు స్టేషన్‌లో విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. నిమజ్జన ఊరేగింపులో డీజేలు, అశ్లీల పాటలను నిషేధించామన్నారు. నిబంధనలు ఉల్లంఘిస్తే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఉత్సవాల నిర్వహణకు అనుమతులు తీసుకోవాలన్నారు. ఎస్సై సత్యనారాయణ పాల్గొన్నారు.

సీసీ రహదారుల నాణ్యత పరిశీలన



పోటుమీదలో సీసీ రహదారుల నాణ్యతను పరిశీలిస్తున్న అధికారులు

కోడూరు, ఆగస్టు 23 (ఆంధ్రజ్యోతి): మండలంలో జిల్లా పరిషత్ నిధులతో నిర్మించిన సీసీ రహదారులను శనివారం క్వాలిటీ కంట్రోల్ విజిలెన్స్ అధికారులు పరిశీలించారు. పోటుమీదలో రూ.13 లక్షలతో నిర్మించిన సీసీ రోడ్ల నాణ్యతను క్వాలిటీ కంట్రోల్ డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ కె.వరప్రసాద్, ఏఈఈ రాధాకృష్ణ, పంచాయతీరాజ్ డిప్యూటీ ఈఈ పి.సురేష్‌బాబు, ఏఈఈ విజయ్ కుమార్ పాల్గొన్నారు.

రాయితీపై పశువుల దాణా పంపిణీ

నాగాయలంక, ఆగస్టు 23(ఆంధ్రజ్యోతి): పశుసంవర్ధక శాఖ 50 శాతం రాయితీతో అందించిన 40 బస్తాల పశువుల దాణాను పాడి రైతులకు భావదేవరపల్లిలో సర్పంచ్ మండలి ఉదయభాస్కర్, వైద్యుడు దాసరి రామాంజనేయులు పంపిణీ చేశారు. కమ్మనమోలు, చోడవరం గ్రామాలకు చెందిన పాడిరైతులకూ దాణా అందజేశారు.



పోతేపల్లిలో టంగుటూరి ప్రకాశం పంతులు చిత్రపటానికి నివాళులర్పిస్తున్న మంత్రి కొల్లు రవీంద్ర, కలెక్టర్ డీకే బాలాజీ, అవనిగడ్డలో నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే మండలి బుద్ధప్రసాద్, మచిలీపట్నం ఎస్పీ కార్యాలయంలో నివాళులర్పిస్తున్న ఎస్పీ గంగాధరరావు

స్ఫూర్తిప్రదాత ప్రకాశం పంతులు

జయంతి సందర్భంగా ఆంధ్ర కేసరికి ఘన నివాళులర్పించిన ప్రజా ప్రతినిధులు, అధికారులు

మచిలీపట్నం టౌన్, ఆగస్టు 23 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర తొలి ముఖ్యమంత్రి, ఆంధ్ర కేసరి టంగుటూరి ప్రకాశం పంతులు ధైర్యసాహసాలు అందరికీ స్ఫూర్తిదాయకమని మంత్రి కొల్లు రవీంద్ర అన్నారు. జయంతిని పురస్కరించుకుని శనివారం పోతేపల్లిలో ప్రకాశం పంతులు చిత్రపటానికి కలెక్టర్ డీకే బాలాజీతో కలిసి ఆయన నివాళులర్పించారు. డీపీవో అరుణ, తెలుగురైతు జిల్లా అధ్యక్షుడు గోపు సత్యనారాయణ, తలారి సోమశేఖర్, కార్యదర్శి నరసింహారావు, ఎండీవో వెంకటేష్ పాల్గొన్నారు. జిల్లా కేంద్ర గ్రంథాలయంలో ప్రకాశం పంతులు చిత్రపటానికి గ్రంథాలయ కార్యదర్శి రవికుమార్, డిప్యూటీ లైబ్రేరియన్ బీరం వెంకటరమణ నివాళులర్పించారు.

బ్రిటీష్ తుపాకులకు గుండె చూపించిన ధీరుడు ప్రకాశం పంతులు

అవనిగడ్డ/మోపిదేవి/చల్లపల్లి/గూడూరు/పెడన రూరల్: బ్రిటీష్ తుపాకులకు గుండె చూపించిన ధీరుడు ప్రకాశం పంతులు అని, ఆయన తెగువ నేటితరం రాజకీయ నేతలకు, యువతకు స్ఫూర్తిదాయకమని ఎమ్మెల్యే మండలి బుద్ధప్రసాద్ అన్నారు. తన కార్యాలయంలో టంగుటూరి ప్రకాశం పంతులు జయంతిని ఘనంగా నిర్వహించారు. దివి మార్కెట్ కమిటీ చైర్మన్ కొల్లూరి వెంకటేశ్వరరావు, వైస్ చైర్మన్ రాజనాల వీరబాబు, కూనపరెడ్డి చం ద్రశేఖర్, శోభిల ఏడుకొండలు, ఘంటసాల రాజమోహనరావు పాల్గొన్నారు. మోపిదేవి మండల పరిషత్ కార్యాలయం వద్ద టంగుటూరి చిత్రపటానికి ఎంపీడీవో జె.స్వర్ణభారతి నివాళులర్పించారు. కార్యాలయ ఏవో పాండురంగారావు, ఉద్యోగులు, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు. చల్లపల్లి పంచాయతీ కార్యాలయంలో ప్రకాశం పంతులు చిత్రపటానికి సర్పంచ్ పైడిపాముల కృష్ణకుమారి, ఈవో మాధవేంద్రరావు నివాళులర్పించారు. పెడన మండలం బల్లిపర్రు పంచాయతీ కార్యాలయంలో ప్రకాశం పంతులు చిత్రపటానికి ఎండీవో శివప్రసాద్ నివాళులర్పించారు. పెడన మండల పరిషత్ కార్యాలయంలో జయంతిని ఘనంగా నిర్వహించారు. ఎండీవో శివప్రసాద్, ఈవోఆర్డీ నాగిరెడ్డి, విజయకుమారి, సురేష్ పాల్గొన్నారు. గూడూరు శాఖా గ్రంథాలయంలో టంగుటూరి ప్రకాశం పంతులు చిత్రపటానికి గ్రామీ ణ వైద్యుల సంక్షేమ సంఘం జిల్లా కార్యదర్శి ఎండీ బషీర్ నివాళులర్పించారు. గ్రంథాలయ నిర్వాహకుడు రవి పాల్గొన్నారు.

ప్రత్యేకాంధ్ర సాధనలో టంగుటూరిది కీలక పాత్ర: ఎస్పీ

మచిలీపట్నం క్రైమ్: ప్రత్యేక ఆంధ్ర రాష్ట్ర సాధనలో టంగుటూరి ప్రకాశం పంతులుది నిర్ణాయక పాత్ర అని ఎస్పీ ఆర్.గంగాధరరావు పేర్కొన్నారు. ఎస్పీ కార్యాలయంలో ప్రకాశం పంతులు చిత్రపటానికి ఆయన నివాళులర్పించారు.



మచిలీపట్నంలో స్వర్ణాంధ్ర-స్వచ్ఛాంధ్ర కార్యక్రమంలో మాట్లాడుతున్న ఆర్టీసీ చైర్మన్ కొనకళ్ల నారాయణరావు



చల్లపల్లిలో చెత్తసేకరించే ట్రాక్టర్ డ్రైవర్లను సన్మానిస్తున్న సర్పంచ్ పైడిపాముల కృష్ణకుమారి



మోపిదేవి మండల పరిషత్ కార్యాలయంలో ప్రతిజ్ఞ చేస్తున్న ఉద్యోగులు



గూడూరులో పారిశుధ్య పనులు చేయిస్తున్న పంచాయతీ కార్యదర్శి భాస్కరరావు

పరిసరాలు పరిశుభ్రంగా ఉంచుకుందాం

• స్వర్ణాంధ్ర-స్వచ్ఛాంధ్ర కార్యక్రమంలో ప్రజలకు ఆర్టీసీ చైర్మన్ కొనకళ్ల నారాయణరావు పిలుపు

మచిలీపట్నం టౌన్/చల్లపల్లి/మోపిదేవి/గూడూరు/పెడన రూరల్, ఆగస్టు 23(ఆంధ్రజ్యోతి): పరిసరాలు పరిశుభ్రంగా ఉంచుకుందామని ప్రజలకు ఆర్టీసీ చైర్మన్ కొనకళ్ల నారాయణరావు పిలుపునిచ్చారు. నగర కార్పొరేషన్ ఆధ్వర్యంలో పలు ప్రాంతాల్లో శనివారం నిర్వహించిన స్వర్ణాంధ్ర-స్వచ్ఛాంధ్ర కార్యక్రమాల్లో ఆయన పాల్గొన్నారు. రైతుబజారు వద్ద నిర్వహించిన సభలో ఆయన మాట్లాడారు. రైతుబజారులో ప్లాస్టిక్ సంచులు వాడొద్దని ఆయన సూచించారు. టీడీపీ కార్పొరేటర్లు చిత్తజల్లు నాగరాము, దేవరపల్లి అనిత, దింటకుర్తి సుధాకర్, మునిసిపల్ అసిస్టెంట్ కమిషనర్ గోపాలరావు, శానిటరీ ఇన్‌స్పెక్టర్లు, హెల్త్ అసిస్టెంట్లు పాల్గొన్నారు. చల్లపల్లిలో పంచాయతీ ఆధ్వర్యంలో స్వచ్ఛాంధ్ర- స్వచ్ఛ దివస్ కార్యక్రమాన్ని నిర్వహించారు. పురవీధుల్లో ర్యాలీ నిర్వహించారు. ప్లాస్టిక్‌ను నిషేదిద్దాం, పర్యావరణాన్ని కాపాడుదాం అంటూ నినాదాలు చేశారు. పారిశుధ్య చర్యలు చేపట్టారు. పంచాయతీ కార్యాలయంలో చెత్తసేకరణ ట్రాక్టర్ డ్రైవర్లు రిరేష్, రాజేశ్వరరావును సత్కరించారు. ఈవో పీవీ మాధవేంద్రరావు, శానిటరీ ఇన్‌స్పెక్టర్ సూర్యప్రసాద్, సచివాలయ ఉద్యోగులు, సిబ్బంది పాల్గొన్నారు. మోపిదేవి మండల పరిషత్ కార్యాలయం, అవుట్ పోస్టు పోలీస్ స్టేషన్, సుబ్రహ్మణ్యేశ్వరస్వామి దేవస్థానాల్లో స్వచ్ఛ దివస్ కార్యక్రమాలు నిర్వహించారు. అధికారులు, ఉద్యోగులు ప్రతిజ్ఞ చేశారు. ఎంపీడీవో స్వర్ణభారతి, దేవస్థానం ఈవో డి.శ్రీరామవరప్రసాదరావు, ఎస్సై వై.వి.సత్యనారాయణ పాల్గొన్నారు. స్వచ్ఛాంధ్రలో భాగంగా గూడూరు వీధుల్లో చెత్తా చెదారం లేకుండా, మురుగు నీరు లేకుండా పారిశుధ్య సిబ్బందితో గూడూరు పంచాయతీ కార్యదర్శి టి.వి.వి.భాస్కరరావు శుభ్రం చేయించారు. ఆకులమన్నాడులో సర్పంచ్ ఎండీ రఫీ ఆధ్వర్యంలో విద్యార్థులకు చేతుల శుభ్రతపై మల్లవోలు పీహెచ్‌సీ సిబ్బంది అవగాహన కల్పించారు. పెడన మండలం బల్లిపర్రు పంచాయతీలో నిర్వహించిన స్వర్ణాంధ్ర-స్వచ్ఛాంధ్ర కార్యక్రమంలో ఎండీవో శివప్రసాద్ పాల్గొన్నారు. సంపద తయారీ కేంద్రాన్ని తనిఖీ చేశారు. వానపాములను పెంచి ఎరువును తయారు చేయాలని సిబ్బందికి సూచించారు.

పంటకాలువలో మృతదేహం

పెడన, ఆగస్టు 23(ఆంధ్రజ్యోతి): మునిసిపల్ వాటర్ వర్క్స్ సమీపంలోని రామరాజుపాలెం పంట కాలువలో మృతదేహం తేలి ఉండటాన్ని శనివారం ఉదయం స్థానికులు గుర్తించి పోలీసులకు సమాచారం ఇచ్చారు. దీంతో పోలీసులు రంగంలోకి దిగి విచారణ చేశారు. మృతదేహం దక్షిణ తెలుగుపాలేనికి చెందిన కోమట్ల శివనాగరాజు(43)దిగా గుర్తించారు. నాగరాజుకు ఇద్దరు పిల్లలు ఉన్నారు. పదేళ్ల క్రితం భార్యతో గొడవ పడి విడిపోయారు. అప్పటి నుంచి తల్లి సంపూర్ణమ్మ దగ్గర ఉంటున్నాడు. శుక్రవారం తన బంధువు చనిపోవడంతో అతని అంత్యక్రియలకు శివనాగరాజు హాజరయ్యాడు. తర్వాత తనతో పాటు వచ్చిన వారితో కలిసి స్నానం చేసేందుకు రామరాజుపాలెం కాలువలో దిగాడు. మద్యం మత్తులో ఉన్న శివనాగరాజు తనతో వచ్చిన వారందరూ వెళ్లిపోయినప్పటికీ చెరువులో స్నానం చేస్తూనే ఉన్నాడు. శనివారం ఉదయం రామరాజుపాలెం పంట కాలువలో శవమై తేలాడు. సీఐ నాగేంద్రప్రసాద్, ఎస్సై సత్యనారాయణ సంఘటనా స్థలానికి వెళ్లి మృతదేహాన్ని పరిశీలించారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం బందరు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. శివనాగరాజు సోదరుడు కోమట్ల సురేష్ ఇచ్చిన ఫిర్యాదుపై పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.



ఘంటసాల పెద్దగూడెం ఎంపీపీ పాఠశాలను సందర్శిస్తున్న ఎన్ఆర్ఐ రంగనాథ్‌బాబు

పాఠశాలలో షెడ్డు నిర్మాణానికి
రూ.70 వేలు విరాళం

ఘంటసాల, ఆగస్టు 23(ఆంధ్రజ్యోతి): ఘంటసాల పరిధిలోని పెద్దగూడెంలో మండల పరిషత్ ప్రాథమిక పాఠశాల ప్రాంగణంలో విద్యార్థుల సౌకర్యార్థం ఏర్పాటు చేయనున్న షెడ్డు నిర్మాణానికి ఎన్ఆర్ఐ రంగనాథ్‌బాబు రూ.70 వేలు విరాళం ప్రకటించారు. గ్రామస్థుల ఆహ్వానం మేరకు పాఠశాలను శనివారం ఆయన సందర్శించారు. మాలెంపాటి సీతారామాంజనేయులు జ్ఞాపకార్థం గొర్రెపాటి విద్యాట్రస్ట్ ద్వారా రూ.70 వేలు అందించనున్నట్లు ఆయన తెలిపారు. అత్తులూరి రాజేశ్వరి-కోటేశ్వరరావు దంపతులు, జడ్పీ మాజీ ఉపాధ్యక్షుడు గొర్రెపాటి వెంకట రామకృష్ణ, హెచ్‌ఎం నబ్బినేని శ్యామల, ఉపాధ్యాయులు భార్గవి, గ్రామస్థులు దిరిశం పిచ్చేశ్వరరావు, నందేటి శ్రీను పాల్గొన్నారు.

సురవరం సుధాకరరెడ్డి మృతి
సీపీఐకి తీరని లోటు

చల్లపల్లి, ఆగస్టు 23(ఆంధ్రజ్యోతి): సీపీఐ అగ్రనేత, మాజీ ఎంపీ కామ్రేడ్ సురవరం సుధాకరరెడ్డి మృతి పార్టీకి తీరనిలోటని ఆ పార్టీ జిల్లా సహాయ కార్యదర్శి అడ్డాడ ప్రసాద్‌బాబు, ఏపీ రైతుసంఘం రాష్ట్ర నాయకుడు హనుమానుల సురేంద్రనాథ్ బెనర్జీ అన్నారు. చంద్ర రాజేశ్వరరావు వికాసకేంద్రంలో సుధాకరరెడ్డి సంస్మరణ కార్యక్రమం శనివారం నిర్వహించారు. రెండుసార్లు ఎంపీగా పనిచేసిన సుధాకరరెడ్డి, నిష్కళంక నాయకునిగా ప్రజల మన్ననలు పొందారన్నారు. పార్టీనాయకులు, కార్యకర్తలు సుధాకరరెడ్డి చిత్రపటానికి నివాళులర్పించారు. మహిళా సమాఖ్య జిల్లా నేత కంఠంనేని జ్యోత్స్నాదేవి, సీపీఐ నేతలు మల్లుపెద్ది నాగభూషణరావు, నక్కా శ్రీనివాసరావు, కొల్లూరి శ్రీధర్, కంచర్ల ప్రభుకుమారి, పెనుమత్స ప్రభాకరరావు, సిద్ధాబత్తుల బాలయ్య, వాసు, సీపీఎం నేతలు యద్దనపూడి మధు, మహమ్మద్ కరీముల్లా తదితరులు పాల్గొన్నారు.

మహాసభలకు తరలివెళ్లిన సీపీఐ శ్రేణులు

ఒంగోలులో శనివారం నుంచి సోమవారం వరకు నిర్వహిస్తున్న సీపీఐ రాష్ట్ర మహాసభలకు అవనిగడ్డ నియోజకవర్గం నుంచి వంద మంది పార్టీ నాయకులు, కార్యకర్తలు చల్లపల్లి నుంచి ర్యాలీగా ప్రత్యేక వాహనాల్లో తరలివెళ్లారు. రైతుసంఘం రాష్ట్ర నాయకుడు హనుమానుల సురేంద్రనాథ్ బెనర్జీ, సీపీఐ జిల్లా సహాయ కార్యదర్శి అడ్డాడ ప్రసాద్‌బాబు, కంఠంనేని జ్యోత్స్నాదేవి, కంచర్ల ప్రభుకుమారి, యద్దనపూడి మధు జెండా ఊపి ర్యాలీని ప్రారంభించారు.

కేయూ వన్‌టైమ్ ఆపర్చునిటీ పరీక్షా ఫలితాలు విడుదల

మచిలీపట్నం టౌన్, ఆగస్టు 23(ఆంధ్రజ్యోతి): కృష్ణా విశ్వవిద్యాలయం(కేయూ) అనుబంధ సంస్థల్లో వన్‌టైమ్ ఆపర్చునిటీ కింద నిర్వహించిన పరీక్షల ఫలితాలను శనివారం వీసీ కూన రాంజీ విడుదల చేశారు. 2408 మంది పరీక్షలకు హాజరవగా 1329 మంది ఉత్తీర్ణులయ్యారని తెలిపారు. రిజిస్ట్రార్ ఉష, పరీక్షల నియంత్రణాధికారి వీరబ్రహ్మాచారి పాల్గొన్నారు.



మార్కెట్ యార్డులో గోశాలను ప్రారంభించాక గోపూజ చేస్తున్న మంత్రి కొల్లు రవీంద్ర, కలెక్టర్ డీకే బాలాజీ

నగరంలో రోడ్లపై తిరిగే
పశువులు గోశాలకు తరలిస్తాం

● మంత్రి కొల్లు రవీంద్ర

మచిలీపట్నం టౌన్, ఆగస్టు 23(ఆంధ్రజ్యోతి): 'నగరంలో రోడ్లపై తిరుగుతున్న గోవుల వల్ల జరిగే ప్రమాదాలను నివారించేందుకు మార్కెట్ యార్డులో గోశాలను ఏర్పాటు చేశాం. రహదారులపై తిరుగుతున్న ఆవులు, గేదెలను గోశాలకు తరలిస్తాం. పశువులకు కావలసిన గడ్డి, దాణాను ఇక్కడ ఏర్పాటు చేశాం.' అని మంత్రి కొల్లు రవీంద్ర తెలిపారు. శనివారం మార్కెట్ యార్డులో కలెక్టర్ బాలాజీతో కలిసి ఆయన గోశాలను ప్రారంభించారు. గోపూజ చేశారు. పోలీసు, రెవెన్యూ, వ్యవసాయ మార్కెట్ కమిటీ, మునిసిపాలిటీ, పశుసంవర్ధక శాఖల సహకారంతో ఒక కమిటీని ఏర్పాటు చేసి, కమిటీ ఆధ్వర్యంలో గోశాలను ఏర్పాటు చేశామన్నారు. గోశాలకు 112 ఆవులను తీసుకొచ్చామని కలెక్టర్ బాలాజీ తెలిపారు. ఏఎంసీ చైర్మన్ కుంచే నాని, డీఎస్పీ సీహెచ్ రాజా, మునిసిపల్ సహాయ కమిషనర్ గోపాలరావు, కార్పొరేటర్ అనిత, తెలుగురైతు జిల్లా అధ్యక్షుడు గోపు సత్యనారాయణ, గొర్రెపాటి గోపీచంద్ తదితరులు పాల్గొన్నారు.

ఆర్వో ప్లాంట్ ప్రారంభం

రాష్ట్రంలో పేదల ఆకలిని అన్న క్యాంటీన్లు తీరుస్తున్నాయని, వాటిని కూటమి ప్రభుత్వం విజయవంతంగా నిర్వహిస్తోందని మంత్రి కొల్లు రవీంద్ర తెలిపారు. మూడు స్తంభాల సెంటర్‌లోని అన్న క్యాంటీన్‌కు డాక్టర్ బి.ధన్వంతరీ ఆచార్య అందించిన రూ.75వేలతో ఏర్పాటు చేసిన ఆర్వో ప్లాంట్‌ను మంత్రి ప్రారంభించారు.

జలక్రీడల జాతీయ పోటీల్లో నాగాయలంక క్రీడాకారులకు పతకాలు



పతకాలు చూపుతున్న నాగిడి గాయత్రి, నాగిడి రాజేష్

నాగాయలంక, ఆగస్టు 23(ఆంధ్రజ్యోతి): ఖేల్ ఇండియా-2025 జాతీయ జలక్రీడల పోటీలు ఈనెల 21 నుంచి 23 వరకు జమ్ముకాశ్మీర్‌లో జరిగాయి. రాష్ట్రం తరఫున నాగాయలంకకు చెందిన నాగిడి గాయత్రి, నాగిడి రాజేష్ పాల్గొని పతకాలను సాధించారు. మహిళ, పురుషుల సీనియర్ కాయక్ స్లాలోమ్ విభాగాల్లో నాగిడి గాయత్రి రజతం, నాగిడి రాజేష్ కాంస్య పతాకాలను సాధించారు. వీరికి శాప్ చైర్మన్ రవినాయుడు, క్రీడల జిల్లా అధికారి ఝాన్సీలక్ష్మి, కెనోయింగ్, కయాకింగ్ జిల్లా సంఘం అధ్యక్షుడు వెంకటేశ్వరరావు, అడ్వయిజర్ టి.శివారెడ్డి, ఎమ్మెల్యే మండలి బుద్ధప్రసాద్ అభినందనలు తెలిపారు.

ఒకటి నుంచి ప్లాస్టిక్ నిషేధం

చల్లపల్లి/పెడనరూరల్, ఆగస్టు 23(ఆంధ్రజ్యోతి): చల్లపల్లి రైతుబజారులో సెప్టెంబరు ఒకటవ తేదీ నుంచీ ప్లాస్టిక్ నిషేధం అమలులో ఉంటుందని, నిబంధనలు ఉల్లంఘిస్తే జరిమానాలు విధిస్తామని రైతుబజారు ఈవో చంద్రమోహన్ తెలిపారు. రైతుబజారులో ప్లాస్టిక్ నిషేధంపై రైతులు, కూరగాయల వ్యాపారులు, ప్రజలకు శనివారం ఆయన అవగాహన కల్పించారు. పెడన రైతుబజారులో క్యారీబ్యాగ్‌లు వాడకాన్ని మానేస్తున్నామని కూరగాయలమ్మే రైతులు తెలిపారు. కొనుగోలుదారులకు ప్లాస్టిక్ కవర్లు ఇవ్వబోమని ఎస్టేట్ అధికారి సురేష్ సమక్షంలో ప్రతిజ్ఞ చేశారు.